తిరుపతి - చిత్తూరు

తెలుగు జాతీయ దినపత్రిక
వార్త

## అకారణంగా సస్పెండ్ చేశారు

### నిరసనకు దిగిన హెచ్ఎం



సత్యవేడు, ఆగస్టు 17 ప్రభాతవార్త: తనను అకారణంగా సస్పెండ్ చేశారని మండలంలోని రాజగోపాలపురం హెచ్ఎం జ్యోతి నిరసనకు దిగారు. అధికారుల చర్యను ప్రతిఘటిస్తూ జ్యోతి సోమవారం ఉదయం నుంచి రాత్రి 7 గంటల వరకు మండల విద్యాశాఖ అధికారి కార్యాలయం వద్ద నిరసన చేపట్టారు. స్థానిక ఎంఈవో రవి తనను అకారణంగా ఇబ్బందులు గురి చేస్తూ తప్పుడు నివేదికలతో తన సస్పెన్షన్‌కి సహకరించారని ఆమె ఆరోపించారు. హెచ్ఎం నిరసనను తెలుసుకున్న ఎంఈవో-2 ఉష, ఎంపీడీవో కార్యాలయ ప్రధాన పర్యవేక్షకులు విక్రమ్, స్థానిక ఎస్ఐ సాయినాథ్‌చౌదరి, అదనపు ఎస్ఐ లావణ్య అధికారులు జ్యోతితో సంప్రదించారు. నిరసన విరమించారు. మంగళవారం తప్పకుండా మీకు న్యాయం చేస్తామని, మీ డిమాండ్లను ఉన్నత అధికారులకు తెలియజేయడం జరుగుతుందని వారు హామీ ఇచ్చారు.

## గరుడ పంచమిన గరుడసేవ

తిరుమల, ఆగస్టు 17ప్రభాతవార్తప్రతినిధి:



గరుడపంచమి పర్వదినాన సోమవారం రాత్రి మలయప్పస్వామి ఇష్టవాహనమైన గరుడునిపై తిరుమాడ వీధులలో విహరించి భక్తులను కటాక్షి ంచారు. రాత్రి 7 గంటలకు గరుడ వాహనసేవ ప్రారంభమైంది. శ్రీవారి వాహనాల్లోను, సేవకుల్లోను అగ్రగణ్యుడు గరుడుడు. ప్రతి ఏడాదీ గరుడ పంచమిని శుక్ల పక్షం ఐదవ రోజు ఘనంగా నిర్వహిస్తారు. ఈ వాహనసేవలో పెద్దజీయర్, చినజీయర్ ,అదనపు ఈఓ చిరుమామిళ్ళ వెంకయ్య చౌదరి దంపతులు,

# ధుమ్మురేగుతున్న రాజకీయ వ్యాఖ్యలు

### -వ్యక్తిగత విమర్శలకే పరిమితమైన నేతలు



ప్రభాతవార్త-తిరుపతి:

తిరుపతి రాజకీయాలు క్రమంగా ప్రజా సమస్యలు, అభివృద్ధి అంశాల నుండి వ్యక్తిగత విమర్శలు, కుల ప్రస్తావనలు, సవాళ్లు-ప్రతిసవాళ్ల వైపు మళ్లుతున్నాయన్న విమర్శలు వినిపిస్తున్నాయి. అధికార తెలుగుదేశం పార్టీ, ప్రతిపక్ష వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు పరస్పర ఆరోపణలు, విమర్శలకే అధిక ప్రాధాన్యం ఇస్తున్నారనే అభిప్రాయం ప్రజల్లో హాట్‌టాపిక్‌గా మారింది. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడి రెండేళ్లు పూర్తవుతున్న నేపథ్యంలో తిరుపతి నగరానికి సంబంధించి చేపట్టాల్సిన కొత్త అభివృద్ధి కార్యక్రమాలు, పెండింగ్‌లో ఉన్న ప్రజా సమస్యలు, మౌళిక వసతుల మెరుగుదల వంటి అంశాలపై రాజకీయ పార్టీలు మరింత దృష్టి పెట్టాల్సిన అవసరం ఉంది. అయితే ప్రస్తుతం రెండు పార్టీల మధ్య రాజకీయ చర్చ ఎక్కువగా వ్యక్తిగత విమర్శల చుట్టూనే సాగుతోంది. ఇరు పార్టీలకు చెందిన నాయకులు ఒకరిపై ఒకరు భూకబ్జా ఆరోపణలు చేసుకోవడం, 'రౌడీల్లు, 'గుండాల్లు అంటూ పరస్పరం విమర్శించుకోవడం రాజకీయ వాతావరణాన్ని మరింత దిగజారుస్తోందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. రాజకీయ భేదాలు సహజమే అయినప్పటికీ, వ్యక్తిగత దూషణలు ప్రజాస్వామ్య చర్చకు ప్రత్యామ్నాయం కాలేవన్నది ప్రజాస్వామ్యవాదుల అభిప్రాయం.

### మేయర్ ఎన్నికల నేపథ్యంలో పార్టీ నిర్మాణంపై ప్రశ్నలు

తిరుపతి నగరపాలక సంస్థ ఎన్నికలు అక్టోబర్‌లోగానీ నవంబర్‌లో జరిగే అవకాశం ఉందన్న ప్రచారం నేపథ్యంలో రాజకీయ పార్టీలకు ముందస్తు సన్నద్ధత కీలకంగా మారింది. మేయర్ ఎన్నికను ప్రత్యక్ష పద్ధతిలో నిర్వహించే దిశగా ప్రభుత్వం చర్యలు చేపట్టే అవకాశం ఉందన్న సమాచారం కూడా రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. అయితే ఎన్నికలు సమీపిస్తున్నప్పటికీ డివిజన్ల వారీగా పార్టీ నిర్మాణం, కార్యకర్తల సమన్వయం, ప్రజలతో నిరంతర సంబంధాలు, స్థానిక సమస్యలపై కార్యాచరణ వంటి అంశాలపై ప్రధాన రాజకీయ పార్టీలు తగినంత దృష్టి సారించడం లేదన్న విమర్శలు ఉన్నాయి.

### మాటల యుద్ధానికి కొత్త స్థాయి

ఇటీవల వైసీపీ జిల్లా అధ్యక్షుడు భూమన కరుణాకర్‌రెడ్డి తనపై కేసు నమోదు చేయడాన్ని ప్రస్తావిస్తూ జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్‌పై తీవ్ర విమర్శలు చేశారు. కలెక్టర్‌ను 'డాకూ మంగళ్‌సింగ్‌'తో పోల్చడమేగాక జిల్లా ఇన్‌చార్జి మంత్రి అనగాని సత్యప్రసాద్‌ను 'చార్లెస్ శోభరాజ్‌'తో పోల్చారు. దీనిపై సోమవారం టిడిపి తిరుపతి ఇన్‌చార్జి జె.బి. శ్రీనివాస్ తన నివాసంలో నిర్వహించిన మీడియా సమావేశంలో తీవ్రంగా స్పందించారు. భూమన కరుణాకర్‌రెడ్డిని 'వెయ్యి మంది డాకూ మంగళ్‌సింగ్‌లతో' సమానంగా, ఆయన కుమారుడు, వైసిపి తిరుపతి సమన్వయకర్త అభినయ్‌రెడ్డిని 'వెయ్యి మంది చార్లెస్ శోభరాజ్‌లతో' సమానంగా పోల్చారు. 2019 ఎన్నికల్లో టిడిపి అభ్యర్థి సుగుణమ్మ నుండి భూమన కరుణాకర్‌రెడ్డి బలవంతంగా ఎమ్మెల్యే పదవి లాక్కున్నారంటూ ఆరోపించారు. అదే సమయంలో కొందరు బిసినాయకులు, టిడిపి నేతలు బిసి వర్గానికి చెందిన కలెక్టర్, మంత్రిని విమర్శించడం తగదని ఆయన వ్యాఖ్యానించారు. అధికారుల రాజకీయ విమర్శల్లో కుల ప్రస్తావన తీసుకురావడం కూడా ప్రజల్లో చర్చకు దారితీస్తోంది. అధికార పక్షం-ప్రతిపక్షం మధ్య విమర్శలు, ప్రతివిమర్శలు తప్పనిసరి. కానీ అవి విధానాలు, పాలన, అభివృద్ధి, ప్రజా సంక్షేమం చుట్టూ ఉండాలి. వ్యక్తులపై దూషణలు, కుల ప్రస్తావనలు, బెదిరింపుల తరహా వ్యాఖ్యలు రాజకీయ సంస్కృతికి ఏమాత్రం మేలు చేయవని తిరుపతి వాసుల్లో గుప్పుమంటోంది.. తిరుపతి ఆధ్యాత్మిక, పర్యాటక నగరంగా అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు పొందిన ప్రాంతం. నగరంలో ట్రాఫిక్ సమస్య, పారిశుధ్యం, తాగునీరు, డ్రైనేజీ, రహదారులు, పార్కింగ్, పట్టణ మౌలిక వసతులు, యాత్రికులకు సౌకర్యాలు, యువతకు ఉపాధి వంటి అనేక అంశాలు రాజకీయ పార్టీల ప్రధాన అజెండాగా మారాల్సి ఉంది.

### ఎన్నికల ప్రక్రియను సజావుగా నిర్వహించడానికి

# ఏర్పాట్లను పూర్తి చేయాలి

### ఎంపీడీవోలను, మున్సిపల్ కమిషనర్లను ఆదేశించిన జిల్లా కలెక్టర్




తిరుపతి కలెక్టరేట్, ఆగస్టు 17 ప్రభాతవార్త : తిరుపతి జిల్లాలో జరగబోవు గ్రామీణ మరియు పట్టణ స్థానిక సంస్థలకు రెండవ సాధారణ ఎన్నికల ప్రక్రియను నిష్పక్షపాతంగా, పారదర్శకంగా, సజావుగా నిర్వహించడానికి అవసరమైన చర్యలను చేపట్టాలని ఎంపిడిఓ లు, మున్సిపల్ కమీషనర్లని జిల్లా కలెక్టర్ మరియు జిల్లా ఎన్నికల అధికారి డా.ఎస్.వెంకటేశ్వర్ ఆదేశించారు. సోమవారం స్థానిక సంస్థల ఎన్నికల సన్నద్ధత పై జేసి ఆర్.గోవింద రావు, తిరుపతి నగరపాలక సంస్థ కమిషనర్ ఎం.జయకృష్ణ, డి ఆర్ ఓ జి.నరసింహులు, డి పి ఓ సుశీలా దేవి, డి ఎల్ డి ఓ లు, ఎం పి డి ఓ లు, మున్సిపల్ కమిషనర్ లు, తిరుపతి, నెల్లూరు, కడప జెడ్ పీ సి ఈ ఓ లు, తదితరులతో జిల్లా కలెక్టర్ బంగ్లా నుండి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ తిరుపతి జిల్లాకు సంబంధించి 807 గ్రామపంచాయతీలు, 7,342 వార్డుల పరిధిలో ఎన్నికలు నిర్వహించడం జరుగుతుందని, ఈ ఎన్నికలు రెండు విడుదలలో నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. ఎంపీడీవోలు ఎన్నికల నిర్వహణకు సంబంధించి పోలింగ్ స్టేషన్ల వివరాలను ఆగస్టు 21వ తేదీ లోపు ఆన్లైన్ నందు పొందుపరచాలని తెలిపారు. వార్డుల పరిధిలో 650 కంటే మించి ఓటర్లు ఉన్న ప్రదేశాలలో అదనపు పోలింగ్ స్టేషన్లను ఏర్పాటు చేయాల్సి ఉంటుందని సూచించారు. పోలింగ్ కేంద్రాలను తప్పనిసరిగా తాత్కాలిక భవనాలలో ఏర్పాటు చేయరాదని ఖచ్చితంగా శాశ్వత ప్రభుత్వ భవనాలలోని ఏర్పాటు చేయాలని ఆదేశించారు. పోలింగ్ కేంద్రాలకు సంబంధించి ఆగస్టు 21 తేదీ లోపు పోలింగ్ కేంద్రాల ముసాయిదా జాబితాను సిద్ధం చేయాలని, ఆగస్టు 26 తేదీ లోపు అభ్యంతరాలు స్వీకరించాలని తెలిపారు. అభ్యంతరాలను పరిశీలించిన అనంతరం ఆగస్టు 28వ తేదీన తుది పోలీస్ స్టేషన్లో జాబితాను జిల్లా కలెక్టర్ మరియు జిల్లా ఎన్నికల అధికారి ద్వారా ఆమోదించిన అనంతరం ఆగస్టు 31వ తేదీన తుది పోలీస్ స్టేషన్లో జాబితాను ప్రచురించాలని ఆదేశించారు. పోలింగ్ కేంద్రాలలో హెల్ప్ డెస్క్, సూచిక బోర్డులు, మరుగుదొడ్లు, త్రాగునీటి వసతి, షామియానా, నిరంతర విద్యుత్తు తదితర మౌలిక సదుపాయాలను ఏర్పాటు చేయాలని సూచించారు.

### సబ్ రిజిష్టర్ కార్యాలయంపై

# ఏసీబీ దాడి

**- లెక్కకు మించి అదనంగా ఉన్న రూ. 2.48 లక్ష స్వాధీనం**
**- ఏ అధికారి అవినీతికి పాల్పడిన ఉపేక్షించం**
**- ఏసిబిడి ఎస్పి శ్రీనివాసులు**

తిరుపతి క్రైం, ఆగస్టు 17, ప్రభాతవార్త




తిరుపతి సబ్ రిజిస్టర్ కార్యాలయంలో లెక్కకు మించి అదనంగా ఉన్నటు వంటి నగదును ఏసీబీ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. సాధారణంగా నిర్వహించే తనిఖీలలో భాగంగా సోమవారం తిరుపతి సబ్ రిజిస్టర్ కార్యాలయం పై ఏసీబీ డిఎస్పి శ్రీనివాసులు ఆధ్వర్యంలో ఆకస్మికంగా దాడి చేశారు. దాడుల అనంతరం పాత్రికేయుల సమావేశంలో ఏసీబీ డీఎస్పీ మాట్లాడుతూ తమ విధుల్లో భాగంగా తిరుపతి సబ్ రిజిస్టర్ కార్యాలయం పై ఆకస్మికంగా తనిఖీలు చేపట్టామన్నారు. ఇందులో సోమవారము 42 రిజిస్ట్రేషన్లు కాగా ఆ రసీదులు పోను అదనంగా 2.48 ల రూ లభించడంతో వాటిని స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. ఇంకా అధికారులపై పూర్తి దర్యాప్తు కొనసాగిస్తున్నామని దీనికి కారకులైన అధికారులను మరుసటి రోజు తెలియజేస్తామని వివరించారు.

### అవినీతికి పాల్పడే అధికారులని ఉపేక్షించం

అవినీతి లంచాలకు పాల్పడే ఎంతటి అధికారం అయినా ఉపేక్షించమని వారిపై శాఖాభరమైన చర్యలు చేపడతామని ఏసిబి డిఎస్పి శ్రీనివాసులు పాత్రికేయుల సమావేశంలో తెలియజేశారు. సామాన్యులు ఎవరైనా తమకు లిఖితపూర్వక ఫిర్యాదు చేస్తే వెంటనే చర్యలు చేపడతామని ప్రజలకు భరోసా ఇచ్చారు.

# ప్రజల సంతృప్తి స్థాయి పెరిగేలా సమస్యలు పరిష్కారం : కలెక్టర్

చిత్తూరు, ఆగస్టు 17 ప్రభాతవార్త:

ప్రజల నుండి సమస్యలపై అందుతున్న ఫిర్యాదులను సత్వరం పరిశీలించి వాటిని పరిష్కరించి, ప్రభుత్వ సేవలపై ప్రజల్లో విశ్వాసం మరింత పెంపొందించేలా అన్ని శాఖల అధికారులు సమన్వయంతో విధులు నిర్వర్తించాలని కలెక్టర్ సుమిత్‌కుమార్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో నూతనంగా నిర్మించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక సమావేశ భవనంలో సోమవారం కలెక్టర్ సుమిత్‌కుమార్ ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమంకు హాజరై ప్రజల నుండి సమస్యలపై అర్జీలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ సుమిత్‌కుమార్‌తో పాటు జాయింట్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్, జిల్లా రెవెన్యూ అధికారి మోహన్‌కుమార్, చిత్తూరు ఆర్డీఓ శ్రీనివాసులునాయుడు, కెఆర్‌ఆర్‌సి డిప్యూటీ కలెక్టర్ టి.వెంకట్ సునీల్, డిప్యూటీ కలెక్టర్ వై.సురేష్, ఫారెస్ట్ సెటిల్‌మెంట్ ఆఫీసర్ యు.పుల్లారెడ్డి, డిజాస్టర్ మేనేజ్‌మెంట్ డిపిఎం పి.మధుసూధన్‌రావుతో పాటు జిల్లాలోని వివిధ శాఖల ఉన్నత అధికారులు హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజల నుండి అందిన ప్రతి ఫిర్యాదును బాధ్యతగా పరిగణించి నిర్దేశిత గడువులోపు నాణ్యతతో పరిష్కరించాలన్నారు. కేవలం ఫిర్యాదులు ముగించడం కాకుండా సమస్యకు శాశ్వత పరిష్కారం చూపే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. కలెక్టరేట్‌లోని నూతన సమావేశభవనంలో సోమవారం కలెక్టర్ సుమిత్‌కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమానికి జిల్లాలోని ప్రజల నుండి సమస్యలపై 281 అర్జీలు అందాయి.





## మమ్మల్ని ఒంటరి చేసి వెళ్ళిపోయావా..!!

### కుటుంబ సభ్యుల కన్నీటి ఆర్తనాదాలు

### స్వగ్రామం చేరిన దిలీప్ కుమార్ మృతదేహం

చిట్వేలి, ఆగస్టు 17 ప్రభాతవార్త:

దేవుడా మేము ఏమి పాపం చేసాము. మా కన్న కొడుకుని దూరం చేశావు అంటూ బుంగటావుల దిలీప్ కుమార్ తల్లిదండ్రుల శ్రీహరి, చామండి మరియు కుటుంబ సభ్యుల కన్నీటి ఆర్తనాదాలు తిరుపతి జిల్లా చిట్వేలి మండల పరిధిలోని జట్టువారిపల్లి గ్రామాన్ని నిర్ఘాంత పరిచాయి. 27 సంవత్సరాలకే నీకు నూరేళ్లు నిండాయా తండ్రి అంటూ కుటుంబీకులు, బంధువులు, స్థానికులు బోరున విలపించారు. ఆగస్టు 7న అమెరికా కెంట్ నగరంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో దిలీప్ కుమార్ మరణించగా పది రోజుల నుంచి తన కుమారుడి మరణ వార్తతో తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు పడ్డ ఆవేదన, రోదన నివారించడం ఎవరితరం కాలేదు. మృతదేహం కోసం బరువైన గుండెతో ఎదురుచూశారు. కాగా దిలీప్ కుమార్ మృతదేహం అమెరికా నుంచి సోమవారం మద్రాసుకు చేరుకుంది. స్వగ్రామం జట్టువారిపల్లెలో సోమవారం ఉదయం అంత్యక్రియలు కుటుంబ సభ్యులు నిర్వహించారు. రాజకీయ నాయకులు, మండల వ్యాప్తంగా పరిచయస్తులు, బంధువులు, గ్రామస్తులు పెద్ద ఎత్తున అంతిమయాత్రలో పాల్గొన్నారు.

**కుమారుని చూసి బోరున రోధిస్తున్న తల్లిదండ్రులు**

# ప్రజా సమస్యల పరిష్కార వేదికకు 224 అర్జీలు

### జిల్లా కలెక్టర్ డా.ఎస్.వెంకటేశ్వర్..




తిరుపతి కలెక్టరేట్, ఆగస్టు 17 ప్రభాతవార్త

ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పి జి ఆర్ ఎస్) కార్యక్రమంలో వచ్చిన అర్జీలకు నాణ్యమైన పరిష్కారం చూపాలని జిల్లా కలెక్టర్ డా.ఎస్.వెంకటేశ్వర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం ఉదయం జిల్లా కలెక్టరేట్ నందు ఏర్పాటు చేసిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పి జి ఆర్ ఎస్) కు వచ్చిన అర్జీదారులకు గౌరవప్రదంగా కుర్చీల ఏర్పాటుతో, వివిధ ప్రాంతాల నుండి వచ్చిన అర్జీదారులకు త్రాగునీటి సౌకర్యం, మెడికల్ క్యాంప్, గ్రామాల నుండి వచ్చు అర్జీదారులకు టి సరఫరా తదితర సౌకర్యాలను కల్పించి వారి సమస్యలను సావధానంగా వింటూ అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా పీ జి ఆర్ ఎస్ లో వచ్చిన అర్జీలకు నాణ్యమైన పరిష్కారం చూపాలని అర్జీదారుల సమస్యలపై నిరక్ష్య్యం వహించరాదని తెలిపారు. జిల్లా రెవిన్యూ అధికారి జి.నరసింహులు, స్పెషల్ డిప్యూటీ కల్లెక్టర్లు, భరత్ నాయక్, నాగార్జున, ట్రైని డిప్యూటీ కలెక్టర్. గీతాంజలి లతో కలసి ప్రజల నుండి అర్జీలు స్వీకరించారు. వివిధ ప్రాంతాల నుండి వచ్చిన అర్జీదారుల నుండి వినతులను స్వీకరించి, ఆన్లైన్ నమోదుతో సిబ్బంది రసీదులు అందించారు. మొత్తం 224 అర్జీలు రావడం జరిగిందని వేగవంతంగా పరిష్కరించాలని అధికారులను జిల్లా కలెక్టర్ ఆదేశించారు.

# శ్రీకాళహస్తి మున్సిపల్ ఎన్నికలపై సందిగ్ధత

### కోర్టుకేసులు ఉపసంహరించుకున్నా ఎన్నికలు ప్రశ్నార్థకమే!

శ్రీకాళహస్తి ఆగష్టు 17 ప్రభాతవార్త

రాష్ట్రం స్థానిక సంస్థల ఎన్నికల సందడి చోటు చేసుకుంది. అయితే శ్రీకాళహస్తి మున్సిపాలిటికి ఈ సారి అయినా ఎన్నికలు జరుగుతుందా? లేదా? అనేది సందిగ్దత చోటు చేసుకుంది. గత ప్రభుత్వంలో డీలిమిటేషన్ కేసులతో ఎన్నికలు జరగలేదు. దాంతో కేంద్ర ప్రభుత్వం మంజూరు చేసే ఆర్థిక సంఘ నిధులు రాక అభివృద్ధికి అడ్డంకిగా మారింది. అభివృద్ధి కేవలం జనరల్ ఫండ్స్ మీదనే ఆధారపడింది. అయితే కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగా శాసనసభ్యుడు సుధీర్‌రెడ్డి చొరవతో కోర్టు కేసులు ఉపసంహరించుకున్నా ప్రభుత్వం నుంచి ఎలాంటి ఉత్తర్వులు అందలేదు. అయితే మున్సిపల్ ఎన్నికలకు సంబంధించి ఇటు అధికార పార్టీలోనూ, ప్రతి పక్ష పార్టీనాయకుల్లో సందడి కనబడటం లేదు. కారణం ఏమైనా కావచ్చు కానీ పాలకమండలి లేకపోవటం అభివృద్ధికి ఆటంకం అని చెప్పవచ్చు. శ్రీకాళహస్తి మున్సిపాలిటి ఏర్పడినప్పటి నుంచి ఈ దశకంలోనే ఎన్నికలు జరగలేదు. అయితే మున్సిపల్ శాఖ రాష్ట్రంలోని 23 మున్సిపాలిటిలకు సంబంధించి ఎన్నికల ప్రక్రియను నిర్వహించుటకు నిర్ణయం తీసుకోలేదు. ఇందులో ఆరు మున్సిపాలిటిల్లో శ్రీకాళహస్తితో సహా కోర్టు కేసులు ఉపసంహరించుకున్నా ఎన్నికల నిర్వహణకు సంబంధించి ఆదేశాలు అందలేదు. దాంతో మున్సిపల్ ఉద్యోగులు ప్రశాంతంగా ఉన్నారు.

ఓటర్ల జాబితాలు సిద్ధం:

రాష్ట్ర ప్రభుత్వం మొదట మున్సిపల్ ఎన్నికల నిర్వహణకు సిద్ధమౌతుంది. ప్రజా స్వామ్యబద్ధంగా ఎన్నికల నిర్వహణకు ఆదేశాలు జారి అయ్యాయి. పరోక్ష పద్ధతిలో కాకుండా ప్రత్యక్ష పద్ధతిలో చైర్మెన్, కౌన్సిలర్లను ప్రజలే ప్రత్యక్షంగా ఎన్నుకునే విధంగా ఎన్నికలు నిర్వహించాలని నిర్ణయించింది. దాంతో రాజకీయ పార్టీ స్థానిక నాయకుల్లో గుబులుపట్టుకుంది. ఎన్నికలంటే చైర్మెన్ అభ్యర్థితో పాటు వార్డు కౌన్సిలర్లకు పెట్టుబడి పెట్టాలి. అంటే చైర్మెన్ అభ్యర్థిగా పోటీ చేసే అభ్యర్థి కనీసం రూ.5కోట్లు పెట్టుబడి పెట్టుకోవాలి. మరి అంత ఆర్థిక పెట్టుబడి పెట్టే వారు ఎవరు? అనేది ప్రశ్నార్థకంగా మారింది. గతంలో శ్రీకాళహస్తి మున్సిపాలిటిలో 35 వార్డులుండేది. అయితే కొత్త నిబంధనల మేరకు 43 వార్డులు కావచ్చు. శ్రీకాళహస్తి మున్సిపాలిటిలో పాత ఓటర్ల మేరకు 63,580 కాగా ప్రస్తుతం సర్ పరిశీలన తరువాత 51,359 మంది ఉన్నారు. మున్సిపల్ పరిధిలో 74 పోలింగ్‌స్టేషన్లు ఏర్పాటు చేస్తున్నారు. ఇందులో పురుషులు 24,399 మంది మహిళలు 26,956 మంది ఉన్నారు. కానీ ఎన్నికల నాటికి ఏ ప్రాతిపదికన ఎన్నికలు నిర్వహిస్తారనేది వేచి చూడాలి. ఇప్పటి వరకు అందిన సమాచారం మేరకు 2025 నాటి జాబితాల మేరకు ఎన్నికలు నిర్వహించాలని సూచించారు. ఈ మేరకు ఏర్పాట్లు చేయాల్సి ఉంది.




### ఎన్నికలపట్ల నాయకుల్లో ఉదాసీనత:

శ్రీకాళహస్తి మున్సిపల్ ఎన్నికల పట్ల అధికార, ప్రతిపక్ష పార్టీల నాయకుల్లో ఉదాసీనత చోటు చేసుకుంది. అయితే ఈ నెలాఖరుకు స్పష్టత వచ్చే అవకాశం ఉంది. ఓ వైపు ఎన్నికల హడావిడి మరో వైపు రిజర్వేషన్ల ఖరారు కావాల్సి ఉంది. ఏ మున్సిపాలిటికి ఎవరికి కేటాయించబడుతుందో? అనేది ప్రశ్నార్థకంగా మారింది. అయితే బిసి రిజర్వేషన్, మహిళా రిజర్వేషన్లలో ఏ మున్సిపాలిటి ఎవరికి వరిస్తుందో వేచి చూడాలి. ఎన్నికలు జరిగితే అధికార పార్టీ కి పదవుల పందారంలో కొంత వరకు మేలు చేకూరుతుందని పరిశీలకులు భావిస్తున్నారు. మరి ఈ సారి అయినా శ్రీకాళహస్తి మున్సిపాలిటికి ఎన్నికలు జరుగుతాయో? లేదో? తేలియని సందిగ్దతకు తెర పడుతుందో లేక పాలకమండలి లేకుండానే పరిపాలన కొనసాగుతుందా? అనేది వేచి చూడాలి.

## సిఎం చంద్రబాబుచొరవతో ఆలయాలకు మహర్దశ

– పికెఎం ఉడాఛైర్మన్ డాక్టర్ బిఆర్ సురేష్‌బాబు

శాంతిపురం, ఆగస్టు 17 ప్రభాతవార్త



సిఎం చంద్రబాబునాయుడు చొరవతో కుప్పం ప్రాంతంలో ఆలయాలకు మహర్దశ లభించిందని పికెఎం ఉడా ఛైర్మన్ డాక్టర్ బిఆర్ సురేష్ బాబు పేర్కొన్నారు. సోమవారం శ్రీవాణి ట్రస్ట్ నిధులు 25లక్షలతో మండలంలోని బెల్లకోగిల గ్రామంలో శ్రీ తిమ్మరాయస్వామి ఆలయ నిర్మాణంకు ఆయన భూమిపూజ చేసి పనులు ప్రారంభించారు. కుప్పం నియోజకవర్గంలో సుమారు 139ఆలయాలకు శ్రీవాణి ట్రస్ట్ ద్వారా 34కోట్ల నిధులను సిఎం చంద్రబాబు మంజూరు చేయించి గ్రామదేవతల ఆలయాలను నిర్మిస్తున్నారన్నారు. తద్వారా గ్రామాల్లో ఆధ్యాత్మిక వాతావరణం పెంపొందేలా చర్యలు చేపట్టారన్నారు. కార్యక్రమంలో కార్పోరేషన్ డైరెక్టర్ వేణుగోపాల్, కడ సభ్యుడు సతీష్, నేతలు వెంకటరమణబాబు, రమేష్‌రెడ్డి, నంజుండప్ప, నారాయణస్వామి, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## రైతులను ఆదుకునేది సిఎం చంద్రబాబు

శాంతిపురం, ఆగస్టు 17 ప్రభాతవార్త



రైతులను ఆదుకునేది సిఎం చంద్రబాబునాయుడు అని రాష్ట్ర వడ్డెర కార్పోరేషన్ డైరెక్టర్ పెద్దన్న, బీరేష్ పేర్కొన్నారు. సోమవారం కడపల్లి పంచాయతీ బిఎం గొల్లపల్లి గ్రామంలో రైతులకు పట్టాదారు పాస్ పుస్తకాలను పంపిణీ చేశారు. రైతుబిడ్డ అయిన సిఎం చంద్రబాబుకు రైతుల కష్టాలు తెలుసన్నారు. సుమారు 200 ఎకరాల భూమికి గాను 118మంది రైతులకు పట్టాదారు పాస్ పుస్తకాలను రాజముద్రతో అందిస్తున్నట్లు చెప్పారు. రైతులు ఈసందర్భంగా సిఎం చంద్రబాబుకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో విఆర్వో చాణక్య వేదవతి, పలువురు నేతలు పాల్గొన్నారు.

## నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

శాంతిపురం, ఆగస్టు17 ప్రభాతవార్త

శాంతిపురం 33/11కెవి విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని 11కెవి ఫీడర్లు, ఉపకేంద్రాల పరిధిలోని గ్రామాల్లో మంగళవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని రెస్కో ఛైర్మన్ ప్రతాప్, ఎండి సోమశేఖర్, డిఇ హిమ్మత్ సాగర్ తెలిపారు. బోయనపల్లి ఫీడర్, దండికుప్పం, శివరాంపురం ఉపకేంద్రాల పరిధిలోని గ్రామాల్లో ఉదయం 9గంటలనుంచి మధ్యాహ్నం1 గంట దాకా విద్యుత్ సరఫరా ఉండదన్నారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

## ఎంపిడిఓను కలసిన నాయకులు

రామకుప్పం, ఆగస్టు 17 ప్రభాతవార్త



మండల నూతన ఎంపిడిఓ అశ్వినిని కూటమి నేతలు మర్యాదపూర్వకంగా కలసి ఘనంగా సత్కరించారు. గ్రామాల్లో మౌలిక వసతుల కల్పన, తాగునీటి సమస్యలు తలెత్తకుండా చూడాలని నేతలు ఎంపిడిఓను కోరారు. కార్యక్రమంలో మాజీ ఎంపిపి ఆంజనేయరెడ్డి, నేతలు సలాంసాబ్, రామకృష్ణప్ప, విజయ్‌రెడ్డి, బాలరాజు, అల్లిశీను, మంజునాథ్, మోహన్ పాల్గొన్నారు.

## ద్విచక్రవాహనాన్ని ఢీకొన్న టెంపో.. వ్యక్తి మృతి

వి.కోట, ఆగస్టు 17 ప్రభాతవార్త



మండలంలోని నెర్నిపల్లి వద్ద కుప్పం – పలమనేరు జాతీయ రహదారిలో టెంపో టువీలర్‌ను ఢీకొన్న సంఘటనలో ఓ వ్యక్తి మృతి చెందాడు. స్థానికులు తెలిపిన మేరకు వివరాలిలా.. మండలంలోని వైసి బండపల్లికి చెందిన అబ్దుల్ రహమాన్ (35) టువీలర్‌లో నెర్నిపల్లి పెట్రోల్‌బంక్ వద్దకు చేరుకోగా టెంపో వాహనం ఢీకొంది. దీంతో తీవ్రంగా గాయపడ్డ రహమాన్ సంఘటనా స్థలంలోనే మృతి చెందాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## నిజాలు వెలికితీయడంలో జర్నలిస్టులు నిర్భయంగా విధులు

– ఎపియుడబ్ల్యుజె ఆవిర్భావ దినోత్సవంలో కలెక్టర్ సుమిత్‌కుమార్

చిత్తూరు, ఆగస్టు 17 ప్రభాతవార్త:



నిర్వర్తించాలని కలెక్టర్ సుమిత్‌కుమార్ ...మవారం ఎపియుడబ్ల్యుజె ఆవిర్భావ ...యన్ ఆవిర్భవించి 70 సంవత్సరాలు ...క్రమాలు నిర్వహించారు. యూనియన్ ...దానం నిర్వహించారు. కలెక్టరేట్‌లోని ...వ దినోత్సవం పురస్కరించుకుని కేక్ ...కు ఇంటి స్థలాలు, హెల్త్ కార్డులు, ...నాయకులు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పది రోజుల్లో జర్నలిస్టులపై దాడుల నివారణ కమిటీ గురించి నిర్ణయం తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎపియుడబ్ల్యుజె అధ్యక్ష, కార్యదర్శులు లోకనాథన్, మురళీకృష్ణలు, ప్రెస్‌క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు రమేష్‌బాబు, కాళేశ్వర్‌రెడ్డిలు, నాయకులు అశోక్‌కుమార్, మురహరిరెడ్డి, శివకుమార్, శివప్రసాద్, మహేష్, బాలసుందరం, నరేష్, షకీల్, రాజేష్, సీనియర్ పాత్రికేయులు సుభాష్ తదితరులు పాల్గొన్నారు.

## గిట్టుబాటు ధరతో రైతన్న పెదవులపై చిరునవ్వు

గాలి మురళి నాయుడు

తొట్టంబేడు, ఆగస్టు 17 ప్రభాతవార్త



పంట పండించిన రైతుకు కష్టానికి తగ్గ ఫలితం దక్కాలనే డిమాండ్‌కు కూటమి ప్రభుత్వం పెద్ద పీట వేసిందని మండల పార్టీ మాజీ అధ్యక్షుడు గాలి మురళి నాయుడు అన్నారు. సోమవారం ఏర్పాటు చేసిన కార్యక్రమానికి అయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు.. రైతులకు గరిష్ఠంగా గిట్టుబాటు ధర కల్పించడంతో రాష్ట్రంలోని అన్నదాతల్లో ఆనందం వ్యక్తమవుతోంది. ముఖ్యమంత్రి, కూటమి ప్రభుత్వం రైతులను గుర్తించి, వారి పంటలకు గరిష్ఠంగా గిట్టుబాటు ధర కల్పించడంపై హర్షం వ్యక్తం చేశారు.ఎరువుల ధరలు, కూలీల ఖర్చులు పెరిగిపోతున్న తరుణంలో ప్రభుత్వం ఇచ్చిన ఈ గిట్టుబాటు ధర రైతులకు పెద్ద ఊరటనిచ్చిందని ఆయన అన్నారు. గిట్టుబాటు ధరతో పాటు రైతులకు మరికొన్ని సమస్యలు వెంటాడుతున్నాయని మురళి నాయుడు ప్రభుత్వ దృష్టికి తీసుకొచ్చారు. యూరియా కోసం రైతులు గంటల తరబడి లైన్లలో నిలబడాల్సిన పరిస్థితి ఉంది. యాప్ విధానం కాకుండా రైతులకు నేరుగా, సులభంగా యూరియా అందుబాటులోకి తేవాలని కోరారు. అదేవిధంగా వరి కోత యంత్రాలు, స్ప్రేయర్లు, తార్పాలిన్ పట్టాలు వంటి వ్యవసాయ పరికరాలను డిప్ విధానం ద్వారా కాకుండా నేరుగా రైతులకు అందుబాటులో ఉంచితే వారికి మరింత మేలు జరుగుతుందని మురళినాయుడు వివరించారు.

## 50 ఏళ్లు నిండిన రైతులకు రూ.10వేల పెన్షన్ ఇవ్వాలి

శ్రీకాళహస్తి, ఆగస్టు 17 ప్రభాతవార్త




రైతాంగ సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ రాష్ట్ర రైతు సంఘం ఏఐకెఎస్ ఆధ్వర్యంలో సోమవారం ఆర్డిఓ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. రైతు సంఘం రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు నిరసన కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో రైతులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమాలకు రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు రామానాయుడు హాజరై మాట్లాడారు. కూటమి ప్రభుత్వం రైతాంగ సమస్యల పట్ల నిర్లక్ష్యం వహిస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. శ్రీకాళహస్తి డివిజన్ పరిధిలో రైతులు ఎన్నో సమస్యలతో ఇబ్బందులు పడుతున్నారని ఆయన ఆరోపించారు. ఈ సందర్భంగా రామానాయుడు ప్రభుత్వానికి పలు డిమాండ్లను విన్నవించారు. తిరుపతి జిల్లాను కరవు జిల్లాగా వెంటనే ప్రకటించాలని, రైతులకు గిట్టుబాటు ధర కల్పించాలని, 50 సంవత్సరాలు నిండిన ప్రతి రైతుకు ప్రతి నెల రూ.10 వేల రూపాయల పెన్షన్ అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ పార్టీ నియోజకవర్గ కార్యదర్శి జనమాల గురవయ్య, రూరల్ మండల కార్యదర్శి మించల శివకుమార్.., రైతు సంఘం నాయకులు మల్లయ్య, మనీ, కృష్ణయ్య, రూపేష్ కుమార్, బాబు రాజ్, వెంకటయ్య తదితరులు పాల్గొని నినాదాలు చేశారు.

## మద్యం సేవించి వాహనాలు నడుపుతూ

పట్టుబడిన వారికి రూ.70 వేలు జరిమానా

చిత్తూరు, ఆగస్టు 17 ప్రభాతవార్త:

చిత్తూరు ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ పరిధిలో మద్యం సేవించి ద్విచక్ర వాహనాలు నడుపుతూ ఆదివారం పోలీసులకు పట్టుబడ్డ ఏడు మందికి ఫస్ట్ స్పెషల్ జ్యుడిషియల్ సెకండ్ క్లాస్ మేజిస్ట్రేట్ కోర్టు ఒకొక్కరికి రూ.10 వేలు చొప్పున 70 వేల రూపాయలు జరిమానా విధించింది. ట్రాఫిక్ ఇన్స్‌పెక్టర్ నిత్యబాబు వెల్లడించిన వివరాల మేరకు నగర పరిధిలో ఆదివారం ట్రాఫిక్ పోలీసులు వాహనాలు తనిఖీ చేస్తుండగా మద్యం సేవించి వాహనాలు నడుపుతూ 7 మంది పట్టుబడ్డారన్నారు. వీరిని సోమవారం ఫస్ట్ స్పెషల్ జ్యుడిషియల్ సెకండ్ క్లాస్ మేజిస్ట్రేట్ జడ్జి కె.పరిమళదేవి ఎదుట హాజరు పరిస్తే ఆమె ఒకొక్కరికి రూ.10 వేలు చొప్పున జరిమానా విధించారని వివరించారు.

## త్వరితంగా ఎల్పీజి వినియోగదారులు ఈకెవైసి పూర్తి

– జాయింట్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్

చిత్తూరు, ఆగస్టు 17 ప్రభాతవార్త:

జిల్లాలోని ఎల్పీజి గ్యాస్ వినియోగదారులు తమ గ్యాస్ డిస్ట్రిబ్యూటర్ల ద్వారా ఈకెవైసి త్వరితంగా పూర్తి చేయాలని జాయింట్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్ ఓ ప్రకటనలో తెలిపారు. కేంద్ర ప్రభుత్వం ఈకెవైసి గడువును ఆగస్టు 23వ తేదీ వరకు పొడగించడం జరిగిందన్నారు. జిల్లాలో ఈకెవైసి ప్రక్రియను వేగవంతం చేయడానికి గ్యాస్ డిస్ట్రిబ్యూటర్లను సమన్వయం చేసుకుని విస్తృత స్థాయిలో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. గ్యాస్ డిస్ట్రిబ్యూటర్ల కార్యాలయాలు, హోమ్ డెలవరీ సిబ్బంది, ఆయిల్ మార్కెటింగ్ కంపెనీల మొబైల్ యాప్‌ల ద్వారా వినియోగదారులు ఈకెవైసి పూర్తి చేసుకునేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. అయితే సర్వర్‌లో సాంకేతిక సమస్యలు, నెట్‌వర్క్ అంతరాయాలు, బయోమెట్రిక్ ధృవీకరణలో జాప్యం కారణంగా కొంతమంది వినియోగదారులు ఈకెవైసి పూర్తి చేయడంలో ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు గ్యాస్ డిస్ట్రిబ్యూటర్ల ద్వారా తమ దృష్టికి వచ్చిందన్నారు. ఈ మేరకు కేంద్ర ప్రభుత్వం ఈకెవైసి గడువును ఆగస్టు 23వ తేదీ వరకు పొడిగించిందని, గడువులోని గ్యాస్ వినియోగదారులందరీ ఈకెవైసిని పూర్తి చేసుకోవాలని ఆయన కోరారు.

## యాదమరి జడ్పీ పాఠశాల ఆర్ట్ మాస్టర్ కె.దామోదచ్చారి ప్రతిభ

యాదమరి, ఆగస్టు 17 ప్రభాతవార్త:

చెన్నైలోని జిఆర్ ఆర్ట్స్ ఆకాడెమీ ఆధ్వర్యంలో 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను పురస్కరించుకుని చెన్నై ఇంజంబాక్కం చోళమండల్ ఆర్ట్ క్యాంపులో యాదమరి జడ్పీ ఉన్నత పాఠశాల ఆర్ట్ మాస్టర్ కె.దా మోదరచ్చారి పాల్గొని విశేష ప్రతిభ కనబరిచారు. ఈ ఆర్ట్ క్యాంపులో ఆర్ట్ మాస్టర్ కె.దామోదరచ్చారి పాల్గొని స్వరాజ్య పోరాటం తాలుకా దేశభక్తికి సంబంధించిన స్త్రీల త్యాగం ప్రతిబింబించే చిత్రం కాన్వాస్‌పై అక్రిలిక్ కలర్స్‌తో చిత్రించి అందరిని ఆకట్టుకున్నారు. దేశం కోసం భర్తలను, కొడుకులను, అన్నదమ్ములను అర్పించిన స్త్రీల త్యాగం చాటే చిత్రంను ఆర్ట్ మాస్టర్ దామోదరాచ్చారి చిత్రీకరించడంతో ఈ కార్యక్రమానికి విచ్చేసిన ప్రతి ఒక్కరినీ ఈ చిత్రం ఆకట్టుకుంది. ఈ చిత్రానికి ఆర్ట్ మాస్టర్ దామోదరచ్చారి స్త్రీల త్యాగ శిఖరం అని పేరు పెట్టారు. ఈ పోటీల్లో దేశ నలుమూలల నుండి సుమారు 40 మంది చిత్రకారులు పాల్గొన్నారు. ఈ ఆర్ట్ క్యాంపులో ప్రముఖ సంగీత దర్శకులు శ్రీ దిన, శ్రీ చెల్ల వైద్యనాథన్‌లు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు.

## విద్యుత్ బిల్లులు చెల్లింపులపై అవగాహన : డిఇఇ జీవన్ రెడ్డి

పలమనేరు, ఆగస్టు 17 ప్రభాతవార్త:

విద్యుత్ బిల్లుల చెల్లింపులపై విని యోగదారులకు అవగాహన కార్య క్రమం నిర్వహిస్తున్నట్లు పలమనేరు డిఇఇ ఆపరేషన్ జీవనరెడ్డి ఓ ప్రకట నలో తెలిపారు. వినియోగదారులు ఫోన్ పే. గూగుల్ పే. పేటి ఎం. అమెజాన్. భీమ్ తదితర యూపీఐ డిజిటల్ పేమెంట్ల ద్వారా బిల్లులు ఎక్కడి నుండి అయి నా 24/7 విధంగా చెల్లించ వచ్చని తెలిపారు. దీని వల్ల సమయం ఆదా కావడంతో పాటు క్యూ లైన్లలో వేచి ఉండే అవస్థలు ఉండవన్నారు. పైగా సురక్షితం సులభమైన విధంగా వందశాతం ప్రయోజనాలు పొందవచ్చని తెలిపారు.

## కుప్పం మార్కెట్ కమిటీ పాలకవర్గం పొడిగింపు

కుప్పం, ఆగస్టు 17 ప్రభాతవార్త



కుప్పం వ్యవసాయ మార్కెట్ కమిటీ పాలకవర్గాన్ని మరో ఆర్నెల్లపాటు పొడగిస్తూ ప్రభుత్వ ఎక్స్అఫిషియో ముఖ్య కార్యదర్శి రాజశేఖర్ సోమ వారం ఉత్తర్వులు జారీ చేశారు. మార్కెట్ కమిటీ పాలకవర్గం గడువు ఆగస్టు 15న ముగియడంతో మరో ఆర్నెల్లకాలం పాటు పొడిగించారు. ఎఎంసి ఛైర్మన్ జిఎం రాజుతో పాటు మరో 18మంది సభ్యులుగా కొనసాగుతారు. కమిటీకి గౌరవాధ్యక్షులుగాస్థానిక ఎమ్మెల్యేగాసి ఎంచంద్రబాబు నాయుడు వ్యవహరిస్తారు.

## అమరావతి ఛాంపియన్‌షిప్‌కు కెడిసి విద్యార్థులు

కుప్పం, ఆగస్టు 17 ప్రభాతవార్త



కుప్పం డిగ్రీ కాలేజ్‌కు చెందిన పది మంది విద్యార్థులు రాష్ట్రస్థాయిలో జరిగే అమరావతి ఛాంపియన్‌షిప్ పోటీలకు ఎంపికైనట్లు కాలేజ్ వైస్ ఛైర్మన్ సాగర్‌రాజ్ తెలిపారు. ఖోఖో లో దర్శిని, పూజ, రమ్య, వెయిట్ లిఫ్టింగ్‌లో నరేంద్రచారి, ఆదర్శ్, వాలీబాల్‌లో ఇందుశ్రీ, అథ్లెటిక్స్‌లో అర్చన, మోనీష్, సుదర్శన్ పోటీలకు ఎంపికైనట్లు చెప్పారు. విద్యార్థులు రాష్ట్రస్థాయిపోటీల్లో రాణించి జాతీయ స్థాయికి ఎదగాలని ఆయన అభినందించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సుధారాణి, పిడి సుధాకర్, అధ్యాపకులు పాల్గొన్నారు.

## ప్రజాసమస్యల్ని బాధ్యతతో పరిష్కరించాలి

– కడ పి.డి. వికాస్ మర్మత్

కుప్పం, ఆగస్టు 17 ప్రభాతవార్త



ప్రజా సమస్యల్ని అధికార యంత్రాంగం బాధ్యతతో పరిష్కరించాలని కడ ప్రాజెక్ట్ డైరెక్టర్ వికాస్ మర్మత్ ఆదేశించారు. సోమవారం స్థానిక మండల కార్యాలయంలో ఆయన ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పిజిఆర్ఎస్) కార్యక్రమం నిర్వహించారు. ప్రజలు ఈసందర్భంగా వివిధ సమస్యలపై 70 వినతిపత్రాలను అందజేశారు. వీటిని స్వీకరించిన కడ పి.డి. తగు చర్యల నిమిత్తం అధికారులను ఆదేశించారు. అనంతరం మాట్లాడుతూ ప్రతి అర్జీని అధికారులు నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని ఆదేశించారు. ప్రతి సమస్యను ప్రాధాన్యతగా పరిశీలించాలన్నారు. అర్హులైన వారికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా బాధ్యతాయుతంగా పనిచేయాలని ఆదేశించారు. సమస్యలను పరిష్కరించడంలో అధికారులు వేగం చూపాలన్నారు. కార్యక్రమంలో సిఎం పిఎ శ్రీకాంత్, తహశీల్దార్ శివయ్య, డి.టి. ప్రకాష్‌బాబు, డిఇలు గురవారెడ్డి, పురుషోత్తం, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## గ్రామాల అభివృద్ధి సిఎం చంద్రబాబుతోనే

– ఆర్టీసీ వైస్‌ఛైర్మన్ పిఎస్ మునిరత్నం

కుప్పం, ఆగస్టు17 ప్రభాతవార్త



గ్రామాల అభివృద్ధి సిఎం చంద్రబాబుతోనే సాధ్యమవుతుందని ఆర్టీసీవైస్‌ఛైర్మన్ పిఎస్ మునిరత్నం పేర్కొన్నారు. సోమవారం కం గుంది పంచాయతీ కౌసిగానిపల్లి సమీపం లోని బూసన్న కొటాలు గ్రామంలో 15లక్షలతో నూతనంగా సిసి రోడ్డు నిర్మాణ పనులకు ఆయన భూమి పూజ చేసి పనులు ప్రారంభించారు. గ్రామాల్లో అవసరమైన రోడ్లు, వీధి దీపాలు, డ్రైన్లు, మరుగుదొడ్లు, తాగునీటి వసతి తదితర మౌలిక వసతులను కూటమి ప్రభుత్వ పాలనలో చేపట్టడం జరుగుతోందన్నారు. ఏళ్ల తరబడి రోడ్డు కోసం ఎదురుచూసిన ప్రజలు సిఎం చంద్రబాబుకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో క్లస్టర్ ఇన్‌చార్జ్ హైదర్ వలీ, మాజీ సర్పంచ్ ధనశేఖర్, పార్టీ పంచాయతీ అధ్యక్షుడు షరీఫ్, మైనార్టీ సెల్ అధ్యక్షుడు మునాఫ్, స్థానిక నేతలు పాల్గొన్నారు.

## ఆర్టీసీ డిఎంగా రవి బాధ్యతలు

కుప్పం, ఆగస్టు17 ప్రభాతవార్త



కుప్పం ఆర్టీసీ డిపో మేనేజరుగా రవి సోమ వారం బాధ్యతలు చేపట్టారు. ఈసందర్భం గా నూతన డిఎంను ఆర్టీసీ ఉద్యోగులు, డిపో ఎస్ఎం యుఎ కమిటీ సభ్యులు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో యూనియన్ డిపో అధ్యక్షుడు జయపాల్, కార్యదర్శి మునెప్ప, గ్యారేజ్ కార్యదర్శి రహంతుల్లా, వర్కింగ్ ప్రెసిడెంట్ జయశంకర్, సహాయ కార్యదర్శి శ్రీనివాసులు, ఎడిసిలు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

# చిత్తూరు డివిజన్

చిత్తూరు, గంగాధరనెల్లూరు, పూతలపట్టు పలమనేరు, కుప్పం,

## రోజా..సిఎం చంద్రబాబును విమర్శిస్తే ఊరుకోం

– తెలుగుమహిళా నేతలు –హద్దులు దాటొద్దు.. డర్టీ పాలిటిక్స్ మీవే !!

కుప్పం, ఆగస్టు 17 ప్రభాతవార్త



మాజీ మంత్రి రోజా సిఎం చంద్రబాబునాయుడును విమర్శిస్తే చూస్తూ ఊరుకోమని కుప్పం ఏరియా ఆస్పత్రి వైస్‌ఛైర్మన్ భాగ్యలక్ష్మి త్రిలోక్, కడ సభ్యురాలు సుగుణమ్మ, మున్సిపల్ మహిళా అధ్యక్షురాలు శారదమ్మ, కార్పోరేషన్ డైరెక్టర్ తిరుమగళ్ పేర్కొన్నారు. సోమవారం స్థానిక తెదేపా కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. డర్టీ పాలిటిక్స్ చేస్తోంది ఎవరో ప్రజలకు తెలుసన్నారు. అందుకే కేవలం 11 సీట్లకు మాత్రమే పరిమితం చేశారన్నారు. 2029 ఎన్నికల్లోను వైకాపాకు ఓటమి తప్పదని భావించి ఇలా మాట్లాడుతున్నారన్నారు. డబ్బులు పంచి గెలిచేది వైకాపాయేనన్నారు. తల్లికి, చెల్లికి న్యాయం చేయని జగన్ పార్టీలో ఉంటున్న రోజా తన రాజకీయ గురువు అయిన సిఎం చంద్రబాబును విమర్శించడం దారుణమన్నారు. రోజా నోరు అదుపులో పెట్టుకో వాలని లేకుంటే నేరుగా నగరికే వెళ్లి ప్రశ్నిస్తామన్నారు. మహిళలను గౌరవించేది తెదేపాయేనన్నారు. సినీరంగంలో ఉన్న రోజాను రాజకీయాల్లో తెచ్చిన అనంతరం రోజా స్వలాభంకై పార్టీ మారి విమర్శలు చేయడం హాస్యాస్పదం అన్నారు. సిఎం చంద్రబాబు విజన్ ఉన్న లీడర్ అని అదే వైఎస్ జగన్ చెత్తపై సైతం పన్నువేశారన్నారు. సమావేశంలోమహిళానేతలుస్వాతి, షహనాజ్, గీతమ్మ, రాధ తదితరులు పాల్గొన్నారు.

## ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను అందజేసిన ఎంపి

చిత్తూరురూరల్, ఆగస్టు 17 ప్రభాతవార్త:



చిత్తూరు లక్ష్మీనగర్‌కాలనీ ఎంపి కార్యాలయంలో టిడిపి పొలిట్ బ్యూరో సభ్యులు, చిత్తూరు పార్లమెంటు సభ్యులు దగ్గుమళ్ల ప్రసాదరావు రూ.7,94,989 విలువైన ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను ఆప్తులకు అందజేసారు. కష్టాల్లో వున్న వారికి ముఖ్యమంత్రి నారాచంద్ర బాబునాయుడు నేతృత్వంలో నడుస్తున్న కూటమి ప్రభుత్వం ఎప్పుడూ అండగా వుంటుందన్నారు. సహాయనిధి చెక్కులు అందుకొన్న బాధిత కుటుంబాలు సిఎం చంద్రబాబునాయుడు, ఎంపి దగ్గుమళ్ల ప్రసాదరావుకు కృతజ్ఞతలు తెలిపారు.

## మూడవ విడత ఐటిఐకి ధరఖాస్తులు ఆహ్వానం

వెదురుకుప్పం, ఆగస్టు 17 ప్రభాతవార్త :

రెండవ విడత పారిశ్రామిక శిక్షణ కేంద్రంలో చేరడంకు ధరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఐటిఐ కళాశాల ప్రిన్సిపాల్ సుబ్రమణ్యం గురువారం తెలిపారు. వెదురుకుప్పం పారిశ్రామిక శిక్షణ కేంద్రంలో కంప్యూటర్ కోర్సు, డ్రస్‌మేకింగ్, మెకానిక్ డీజల్ ఏడాది కోర్సులు ఎలక్ట్రిషియన్, ఎలక్ట్రాషియన్ మెకానిక్, ఫిట్టర్ రెండు సంవత్సరాల కోర్సులు ఖాళీలు ఉన్నాయని ఆశక్తిగల విద్యార్థులు ధరఖాస్తు చేసుకోవచ్చన్నారు. ఆగస్టు 19 సాయంత్రం 4 గంటల లోపు ఐటిఐ ఆడ్ మిషన్స్.ఎపి.జివో.ఇన్ వెబ్‌సైటులో ధరఖాస్తు చేసుకోవాలని చెప్పారు. ప్రవేశం కొరకు ధరఖాస్తు చేసుకున్న విద్యార్థులు ఆగస్టు 19 ఉదయం 10 గంట నుంచి సాయంత్రం 6 గంటలలోపు వెదురుకుప్పం ఐటిఐ కళాశాల ఆవరణంలో ఒరిజినల్ సర్టిఫికేట్లు వెరిఫికేషన్ చేయించుకోవాలన్నారు. అనంతరం ఆగస్టు 20 వతేది ఉదయం 10 గంటలకు జరుగు ఇంటర్వ్యూకు హాజరుకావలని తెలిపారు.

## అకాడమిక్ ఇన్సెక్టర్లకు దరఖాస్తులు చేసుకోవాలి

వెదురుకుప్పం, ఆగస్టు 17 ప్రభాతవార్త :

పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ ఆదేశాల మేరకు అకాడమిక్ ఇన్స్ట్రక్టర్లకు కొరకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు మండల విద్యాశాఖాధికారి దామోదరం సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండల కేంద్రంలోనివిద్యావనరుల కేంద్రంలో ఆయన మాట్లాడుతూ ఖాళీలను అర్హతగల వారిచే అకాడమిక్ ఇన్స్ట్రక్టర్ల ద్వారా విద్యా బోధన చేయడంకు ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. మండలంలోని వెదురుకుప్పం ఉన్నత పాఠశాలలో స్కూల్ అసిస్టెంట్ ఇంగ్లీషు, ఆళ్ళమడుగు ఉన్నత పాఠశాలలో స్కూల్ అసిస్టెంట్ హిందీ పోస్టులు ఖాళీలు ఉన్నాయని చెప్పారు. అర్హులైన అభ్యర్థులు ఆగస్టు 19 తేదిలోపు మండల విద్యాశాఖాధికారి కార్యాలయంలో దరఖాస్తులు సమర్పించాలని తెలిపారు.

## పారిశుధ్య కార్మికుల సమస్యల పరిష్కారం కోసం 24న ధర్నా

చిత్తూరుహెల్త్, ఆగస్టు 17 ప్రభాతవార్త:



మున్సిపల్ పారిశుధ్య కార్మికుల సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 24వ తేదీన ఎఐటియుసి ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించనున్నట్లు జిల్లా ఎఐటియుసి గౌరవ అధ్యక్షులు ఎస్.నాగరాజు, జిల్లా అధ్యక్షులు విసి గోపినాథ్‌లు పేర్కొన్నారు. ఎస్టీ యు కార్యాలయంలో సోమవారం మున్సి పల్ కార్పొరేషన్ ఔట్‌సోర్సింగ్ వర్కర్స్ యూనియన్ కమిటీ సమావేశం జరిగింది. ఈ సమావేశానికి హాజరైన ఎస్.నాగరాజు మాట్లాడుతూ మున్సిపల్ కార్పొరేషన్ పారిశుధ్య విభాగంలో కార్మికుల సమస్యల పరిష్కారంలో తీరని జాప్యం జరుగుతోందని, గతంలో సమస్యలను పరిష్కరించాలని రాతపూర్వకంగా అధికారులకు విన్నవించినా ఇప్పటి వరకు పరిష్కారం కాలేదన్నారు. ఈ మేరకు ఈ నెల 24వ తేదీన మున్సిపల్ కార్యాలయం ఎదుట పెద్ద ఎత్తున ధర్నా నిర్వహిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఈ సమావేశంలో నాయకులు రమణి, వాసు, సుగుణ, జయశంకర్, సురేష్, సుబ్రమణ్యం, వినాయక, చిత్ర, ఈశ్వర్, సుభాషిణి తదితరులు పాల్గొన్నారు.

## సత్వరం సమస్యలకు పరిష్కార మార్గం

– అధికారులకు మున్సిపల్ కమీషనర్ నరసింహప్రసాద్ ఆదేశం

చిత్తూరు, ఆగస్టు 17 ప్రభాతవార్త:



ప్రజల నుండి సమస్యలపై అందిన వినతిపత్రాలను క్షేత్ర స్థాయిలో పరిశీలించి సమస్యలకు సత్వరం పరిష్కార మార్గం చూపాలని మున్సిపల్ కమీషనర్ నరసింహప్రసాద్ అధికారులను ఆదేశించారు. మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలోని వీడియో కాన్ఫరెన్స్ హాలులో సోమవారం కమీషనర్ నరసింహప్రసాద్ ఆధ్వర్యంలో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి నగర ప్రజల నుండి సమస్యలపై అధికారులకు ఆరు సమస్యలు అందాయి. వీటిని క్షేత్ర స్థాయిలో పరిశీలించి సమస్యలను సత్వరం పరిష్కరించాలని కమీషనర్ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఇంజనీరింగ్ విభాగంకు సంబంధించి 3, టిడ్కో ఇళ్ళకు సంబంధించి 3 సమస్యలు కమీషనర్‌కు అందాయి. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ కమీషనర్ ప్రసాద్, ఎంహెచ్ఓ డాక్టర్ అనిల్‌కుమార్ నాయక్, ఇఇ చంద్రశేఖర్‌రెడ్డి, ఎసిపి నాగేంద్ర, నగరపాలక సంస్థ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## నిర్ధేశించిన గడువులోపు సమస్యలు పరిష్కారం

– ఎస్పీ తుషార్ డూడి

చిత్తూరు, ఆగస్టు 17 ప్రభాతవార్త:



పోలీసు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమంలో ప్రజల నుండి సమస్యలపై అందిన అర్జీలను నిర్ధేశించిన గడువులోపు పరిశీలించి పక్కాగా పరిష్కరించాలని ఎస్పీ తుషార్ డూడి సంబంధిత పోలీసు అధికారులను ఆదేశించారు. జిల్లా పాత పోలీసు కార్యాలయంలో సోమవారం ఎస్పీ తుషార్ డూడి ఆధ్వర్యంలో సోమవారం పోలీసు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎస్పీ తుషార్ డూడితో పాటు అడ్మిన్ ఎఎస్పీ మహబూబ్‌భాషా, ఆపరేషన్స్ ఎఎస్పీ ఎస్.షాను, చిత్తూరు డిఎస్పీ వెంకటన నారాయణలు హాజరై ప్రజల నుండి సమస్యలపై ఫిర్యాదులు స్వీకరించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ప్రజల నుండి వచ్చిన ప్రతి ఫిర్యాదును సమగ్రంగా పరిశీలించి త్వరితగతిన విచారణ జరిపి బాధితులకు న్యాయం చేయడమే తమ లక్ష్యం అన్నారు. ఈ కార్యక్రమంలో మొత్తం 46 ఫిర్యాదులు అందగా అందులో అత్యధికంగా భూ తగాదాలు 11, ఆర్థిక లావాదేవాలకు సంబంధించి 11 సమస్యలు అందగా, పోలీసు సేవలపై 5, ఆస్తి తగాదాలు 5, దారి సమస్యలు 2, వేధింపులు 4, చిన్న గొడవలు 4, బెదిరింపులు, చీటింగ్, ఇంటి తగాదాలు, భర్త వేధింపులపై ఒకొక్క అర్జీ అందాయి.

## 21న సామూహిక వరలక్ష్మీ వ్రతం

శ్రీకాళహస్తి, ఆగస్టు 17 ప్రభాతవార్త

శ్రీకాళహస్తీశ్వరాలయంలో ఈ నెల 21న సామూహిక వరలక్ష్మీ వ్రతాన్ని నిర్వహించుటకు సన్నాహాలు చేస్తున్నట్లు ఆలయ ఇఓ బికె వెంకటేశులు సోమవారం ఓ పత్రికా ప్రకటనలో తెలిపారు. శుక్రవారం శ్రీస్వామి వారి పరకామణి(మందుకొట్టు మండపంలో)సామూహిక వరలక్ష్మీ వ్రతాన్ని ఏర్పాటు చేసారు. మహిళలు విశేష సంఖ్యలో పాల్గొనాలని పిలుపు నిచ్చారు. మొదటి వ్రత పూజలు ఉదయం 7.30గంటలకు ప్రారంభమౌతుందని ఇఓ వివరించారు.

## రాబోవు మున్సిపల్ ఎన్నికల్లో బిజెపి అధిక స్థానాల్లో గెలవాలి



శ్రీకాళహస్తి, ఆగష్టు 17 ప్రభాతవార్త

రాబోవు మున్సిపల్ ఎన్నికల్లో రాష్ట్రంలో బిజెపి అత్యధిక స్థానాల్లో గెలుపు సాధించాలని రాష్ట్ర బిజెపి అధ్యక్షులు పివిఎన్ మాధవ్ పిలుపు నిచ్చారు.శ్రీకాళహస్తికి చెందిన రాష్ట్ర బిజెపి ఉపాధ్యక్షుడు కోలా ఆనంద్ రాష్ట్ర, కేంద్ర నాయకులను శ్రీకాళహస్తికి చెందిన కలంకారి కళాఖండాలతో సత్కరించారు. శ్రీజ్ఞాన ప్రసూనాంబసమేత శ్రీకాళహస్తీశ్వరుని తీర్థ ప్రసాదాలను అందించారు.ఈ సందర్భంగా పార్టీ సమావేశంలో పాల్గొన్న కోలా ఆనంద్‌తోపాటు పార్టీ వర్గాలకు బిజెపి నాయకత్వం రాబోవు స్థానిక సంస్థల ఎన్నికల్లో తమ సత్తా చాటాలన్నారు.ఈ సందర్భంగా నాయకులు రాబోవు స్థానిక సంస్థల ఎన్నికలపై చర్చించుకున్నట్లు తెలిసింది. కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్ళాలని ఓటర్ల మనస్సును గెలుచుకోవాలని చర్చించుకున్నారు.ఈ కార్యక్రమాల్లో కోలా ఆనంద్‌తో పాటు రాష్ట్ర కార్యదర్శి ఆశోక్‌రాజు, శ్రీకాళహస్తి అసెంబ్లీ కోకన్వీర్ జిల్లా ఉపాధ్యక్షుడు మేళాగారం సుబ్రమణ్యం రెడ్డి,కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## తులసికి వైద్యసదుపాయాలు: బాధితురాలి పెదవిపై చిరునవ్వు:

తొట్టెంబేడు, ఆగస్టు 17 ప్రభాతవార్త



పిల్లమేడు పంచాయతీ మామిడిగుంట దళితవాడలో ఇ ంటింటికి సుధీరన్న కార్యక్రమాల్లో పాల్గొన్న ఆయన అక్కడ అనారోగ్యంతో బాధపడుతున్న తులని అనే దివ్యాంగురాలు తులసిని చూసి చలించారు.ఆమె పేదరికం శాపం కాకూడదని ఎంత ఖర్చు అయిన వైద్యసదుపాయం అందిస్తామంటూ భరోసా ఇచ్చారు. ఇచ్చిన మాట మరచిపోకుండా ఆయన అధునాతన వైద్యం అందించేందుకు చొరవ చూపారు. తెలి కళ్లలో కనిపించిన ఆవేదన, నడవాలన్న ఆశను గమనించిన సుధీర్ రెడ్డి వెంటనే స్పందించారు. మంచి వైద్యం అందితే తులసి మళ్లీ కాళ్లపై నిలబడగలదని వైద్యులు చెప్పడంతో, చెన్నై అపోలో వైద్యులతో మాట్లాడి చికిత్స చేయిస్తానని ఆమె కుటుంబానికి ఇచ్చిన మాట ప్రకారం ఆయన చర్యలు తీసుకున్నారు. చెన్నై అపోలో ఆసుపత్రికి చెందిన నిపుణుల బృందాన్ని ప్రత్యేకంగా శ్రీకాళహస్తి ప్రభుత్వ ఆసుపత్రికి రప్పించారు. సోమవారం మండల పార్టీ అధ్యక్షుడు మునిరాజా నాయుడు సహకారంతో తులసికి వైద్య పరీక్షలు చేయించారు. రిపోర్టులు అందిన తర్వాత మరింత మెరుగైన చికిత్స ప్రణాళికను రూపొందిస్తామని వైద్యులు తెలిపారు. అసెంబ్లీ సమావేశాలతో బిజీగా ఉన్నప్పటికీ ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి తులసి ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి పెట్టారు. ఎప్పటికప్పుడు ఫోన్ ద్వారా పరిస్థితిని తెలుసుకుంటూ, విరామ సమయంలో స్వయంగా వీడియో కాల్ చేసి తులసితో మాట్లాడారు. చికిత్సలో ఎలాంటి లోపాలు లేకుండా చూడాలని వైద్యులకు, స్థానిక నాయకులకు ఆదేశాలు ఇచ్చారు. ఎమ్మెల్యే చూపిస్తున్న ఈ మానవీయతపై గ్రామ ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

## చెకుముకి సంబరాలు" పోస్టర్ విడుదల



తొట్టంబేడు , ఆగస్టు 17 ప్రభాతవార్త

విద్యార్థుల్లో శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించేందుకు జన విజ్ఞాన వేదిక ప్రతిష్టాత్మకంగా నిర్వహించే "చెకుముకి సంబరాలు2026" కు శ్రీకారం చుట్టారు.గుండెలిగుంట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల లో తొట్టంబేడు మండల విద్యాశాఖ అధికారి ముని తిరుమలయ్య అధ్యక్షతన పోస్టర్‌ను ఆవిష్కరించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా శ్రీకాళహస్తి డివిజన్ జన విజ్ఞాన వేదిక కార్యదర్శి బి. చెంచయ్య మాట్లాడుతూ.. ఈ నెల్ల 27న 8,9,10 తరగతి విద్యార్థులకు పాఠశాల స్థాయి చెకుముకి సైన్స్ టాలెంట్ టెస్ట్ నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమ నిర్వహణకు సంబంధించి జిల్లా విద్యాశాఖాధికారి అనుమతి కూడా జన విజ్ఞాన వేదిక పొందిందని వివరించారు. ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల ప్రధానోపాధ్యాయులు తమ పాఠశాలలో చెకుముకి టెస్ట్ నిర్వహణకు సహకరించాలని కోరారు. పాఠశాలలోని సైన్స్ ఉపాధ్యాయులు లేదా జన విజ్ఞాన వేదికపై ఆసక్తి ఉన్న ఉపాధ్యాయులు ఈ పోటీని నిర్వహించేందుకు ముందుకు రావాలన్నారు "విద్యార్థుల్లో ప్రశ్నించే తత్వం, శాస్త్రీయ ఆలోచన పెరగడమే చెకుముకి లక్ష్యం" అని చెంచయ్య అన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు రమాదేవి, బి.ఎల్.ఎన్. మూర్తి, భాస్కరయ్య, రమేష్ రెడ్డి, మునీశ్వర్ రెడ్డి, శ్రీకర్ రెడ్డి, ఢిల్లీ బాబు తదితరులు పాల్గొన్నారు.

## "రాజకీయ అరంగేట్రానికి 50 ఏళ్లు"..



శ్రీకాళహస్తి, ఆగస్టు 17 ప్రభాతవార్త

మాజీ మంత్రి, ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ రాజకీయ రంగంలోకి అడుగుపెట్టి 50 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా శ్రీకాళహస్తిలో సంబరాలు నిర్వహించారు. మాజీ శ్రీకాళహస్తి దేవస్థానం ధర్మకర్తల మండలి సభ్యులు వడకలూరు మస్తానయ్య ఆధ్వర్యంలో పట్టణంలోని ఆర్టీసీ, వై.ఎస్ .ఆర్ కూడలి వద్ద కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. మస్తానయ్య మాట్లాడుతూ కన్నా లక్ష్మీనారాయణ అర్ధ శతాబ్దంగా ప్రజా సేవలో ఉన్నారని, ఆయన రాజకీయ ప్రస్థానం యువతకు ఆదర్శమని కొనియాడారు. ఈ సంబరాల్లో దేవి ప్రసాద్, వి. రాము మాజీ టౌన్ బ్యాంక్ డైరెక్టర్ ,రవి కుమార్, గాంధీతదితరులు కన్నకి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు.

## ధర్మరాజుల స్వామి ఉత్సవాలకు పిలుపు



ఏర్పేడు, ఆగస్టు 17 ప్రభాతవార్త

పాపానాయుడుపేటలో జరిగే ద్రౌపదీ సమేత ధర్మ రాజుల స్వామి వార్షిక బ్రహ్మోత్సవాలకు గ్రంథా లయ సంస్థ అధ్యక్షుడు రెడ్డివారి గురవారెడ్డికి ఉత్స వాల ఆహ్వాన పత్రికను చేనేత సంఘం నిర్వాహకులు సోమవారం అందజేసారు. ఆహ్వాన పత్రికను అందు కున్న గురవారెడ్డి ధర్మరాజుల స్వామి బ్రహ్మోత్సవాలు తప్పక విచ్చేస్తానన్నారు. ధార్మిక కార్యక్రమాల పట్ల, సాంప్రదాయాల పట్ల తనకున్న గౌరవాన్ని తెలియ జేస్తూ, బ్రహ్మోత్సవాలు అత్యంత వైభవంగా జరిగేలా ప్రణాళికలు రూపొందించాలని నిర్వాహకులకు గురువారెడ్డి సూచించారు. ఆహ్వాన పత్రికను చేనేత సంఘ సభ్యులు కృష్ణప్ప మొదలి, అర్జున్ బాబు, రోశయ్య పాల్గొన్నారు. ఉత్సవాలకు పెద్ద ఎత్తున భక్తులు తరలి వచ్చి విజయవంతం చేయాలన్నారు

## కౌమార దశలో బాలికలకు జీవన నైపుణ్యాలపై అవగాహన



తిరుపతి విద్య, ఆగస్టు 17 ప్రభాతవార్త

కౌమార దశలో బాలికలు ఆత్మవిశ్వాసం, ఆత్మగౌరవం, భావోద్వేగ నియంత్రణ, నిర్ణయ సామర్థ్యాలను పెంపొందించుకోవాల్సిన అవసరం ఉందని శ్రీ పద్మావతి మహిళా జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ సి. భువనేశ్వరి అన్నారు. శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ఆధ్వర్యంలో కళాశాలలో సోమవారం కౌమార దశ బాలికలకు జీవన నైపుణ్యాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు.కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ సి. భువనేశ్వరి పర్యవేక్షణలో జరిగిన ఈ కార్యక్రమంలో విద్యార్థినులకు కౌమార దశలో ఎదురయ్యే మానసిక, సామాజిక మార్పులు, వాటిని సమర్థంగా ఎదుర్కొనే విధానాలపై అవగాహన కల్పించారు. విద్యార్థినులతో పలు కృత్యాలు చేయించి, వాటి ద్వారా జీవన నైపుణ్యాలను ఆచరణాత్మకంగా నేర్పించారు.ఈ సందర్భంగా డాక్టర్ భువనేశ్వరి మాట్లాడుతూ మానవ పరిణామ క్రమంలో కౌమార దశ అత్యంత కీలకమైన దశ అని అన్నారు. ఈ దశలో సరైన నిర్ణయాలు తీసుకోవడంతో పాటు ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించుకుంటే భవిష్యత్తులో జీవితాన్ని విజయవంతంగా మలుచుకోవచ్చని తెలిపారు. ఆత్మగౌరవం, అంతర్గత శక్తి, చక్కటి జీవన నైపుణ్యాలను పెంపొందించుకునేందుకు ఇటువంటి కార్యక్రమాలు ఎంతగానో ఉపయోగపడతాయని, విద్యార్థినులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.కార్యక్రమానికి ముఖ్య అతిథిగా శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపల్ కె. సుధారాణి హాజరయ్యారు. హోమ్ సైన్స్ శాఖాధిపతి ఆచార్య కె.వి. సుచరిత, మానవ అభివృద్ధి సామాజిక సంక్షేమ శాఖాధిపతి ఆచార్య కె. అనురాధ, ఆచార్య స్వరూపరాణి, ఇంపాక్ట్ ట్రైనర్, హ్యాపీనెస్ కోచ్ యు. హేమావతి విద్యార్థినులకు పలు సూచనలు చేశారు.జీవితంలో ఎదురయ్యే వివిధ సవాళ్లు, సమస్యలను ధైర్యంగా ఎదుర్కొనేలా విద్యార్థినులను తీర్చిదిద్దడం ఈ అవగాహన కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని వారు తెలిపారు. భావోద్వేగాలు, ఒత్తిడిని సమర్థంగా నిర్వహించడంతో పాటు విమర్శనాత్మక, సృజనాత్మక ఆలోచనా సామర్థ్యాలను పెంపొందించుకోవాలని సూచించారు. విద్యార్థినుల సమగ్ర వ్యక్తిత్వ వికాసానికి ఇటువంటి కార్యక్రమాలు దోహదపడతాయని పేర్కొన్నారు.

## జ్ఞానప్రద వేంకటేశ్వర స్వామి ఆలయంలో ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన



తిరుపతి, ఆగస్టు 17 ప్రభాతవార్త:

ఎస్వీయూప్రాంగణంలోని జ్ఞానప్రద వేంకటేశ్వర స్వామి ఆలయంలో ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన మహోత్సవం సోమవారం వైభవంగా నిర్వహించారు. ఉదయం 10 గంటల 13 నిమిషాలకు శుభముహూర్తంలో ఉపకులపతి ఆచార్య టాటా నరసింహరావు , రిజిస్ట్రార్ ఆచార్య ఎం. భూపతి నాయుడు చేతుల మీదుగా ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన కార్యక్రమం జరిగింది. ఈ పవిత్ర కార్యక్రమానికి భక్తులు విశేష సంఖ్యలో హాజరై స్వామివారిని దర్శించుకున్నారు. భక్తులు స్వామివారికి నవరత్నాలు, బంగారు కాసులను వెండి కాసులను సమర్పించారు. ఈ కార్యక్రమంలో ఆచార్య చినరాయుడు , ఆలయ కమిటీ సభ్యులు ఆచార్య నరసింహ ,కెఎం భాను సుబ్రహ్మణ్యం గుండాల గోపినాథ్‌రెడ్డి, సిరిగిరి రమేష్ బాబు ,టీవీఎస్ లక్ష్మీ మ్మనారాయణ ,నరేంద్రనాథ్ పాల్గొన్నారు.

## పద్మావతి వర్సిటీలో సదస్సు



తిరుపతి,ఆగస్టు 17ప్రభాతవార్త:

పద్మావతి మహిళా విశ్వవిద్యాలయంలో ప్రధానమంత్రి ఉచ్చతర్ శిక్షా అభియాన్ ఆధ్వర్యంలో విద్యార్థి మొబిలిటీ కార్యక్రమం జరిగింది.ఎస్పీఎంవీవీ అంతర్జాతీయ సంబంధాల కేంద్రం హోమ్ సైన్స్ విభాగం ,మలేషియాలోని యూనివర్సిటీ మలేషియా తెరెంగానూ సంయుక్తంగా నిర్వహించాయి.

## మానవత్వం మరచి మగబిడ్డను వదలి . . .



శ్రీకాళహస్తి,ఆగస్టు 17 ప్రభాతవార్త

శ్రీకాళహస్తి పొలిమేరల్లోని తెలుగుగంగ కాలనీ సమీపంలో ప్రభుత్వ మహిళా డిగ్రీకళాశాల సమీపంలో అప్పుడే పుట్టిని పసి కందును గుడ్డలో చుట్టి నిర్ధాక్షిణ్యంగా పడేసిన ఆ కఠినాత్మురాలు గురించి చర్చనీయాంశంగా మారింది. మానవత్వం మరచిన ఆ తల్లికి ఏ కష్టం వచ్చిందో? ఏ నష్టం జరిగిందో?పుట్టిన బిడ్డను నిర్ధాక్షిణ్యంగా వదలి పెట్టింది ఎవరో కానీ దీనిపై రక రకాల కథనాలు వినబడుతున్నాయి. అక్రమ సంతానం అని కొందరు. పెళ్ళికాకుండా పుట్టి ఉండవచ్చునని మరి కొందరు వ్యాఖ్యానించారు.పండంటి మగబిడ్డను ఎవరికి దత్తత ఇచ్చినా పెంచుకునే వారు కదా? అలాంటిది సభ్యసమాజం సిగ్గుతో తలదించుకునేలా కర్కశంగా వీధిలో పడవేయటం దారుణమని శాపనార్థాలు పెడుతున్నారు.ఇలాంటి సంఘటనలతో మానవత్వం మీద అసహ్యామేస్తుందని వ్యాఖ్యానిస్తున్నారు.ఈ విషయం టూటౌన్ పోలీసులకు తెలిసింది. వెంటనే సిఐ నాగరాజు అక్కడకుచేరుకున్నారు. మహిళా హాస్టల్ పక్కనే ఉన్న సెప్టిక్ ట్యాంకు వద్ద పడి ఉన్న బిడ్డను హాస్టల్ వార్డెన్ సహాయంతో పురిటిబిడ్డను తీసుకొని శ్రీకాళహస్తి ఏరియా ఆసుపత్రికి చేర్చారు.అక్కడ నుంచి తిరుపతి రుయాకు తరలించి తన మానవత్వాన్ని చాటుకున్నారు.ఈ సంఘటనపై దర్యాప్తు చేస్తున్నట్లు టూటౌన్ సిఐ నాగరాజు వివరించారు.చిన్నారిని తిరుపతికి తరలించినట్లు వివరించారు.

## కన్నుల పండువగా నల్లగంగమ్మ గ్రామోత్సవం

### పార్టీలతో ప్రమేయం లేకుండా నాయకుల హాజరు



శ్రీకాళహస్తి ఆగష్టు 17 ప్రభాతవార్త

శ్రీకాళహస్తి పట్టణంలోని బహాదూరుపేటలో వెలసిన నల్లగంమ్మ ఆలయంలో ఆడిమాసం పొంగళ్లు సందర్భంగా ధార్మిక కార్యక్రమాలను ఆలయ చైర్మెన్ కంఠారమేష్ సారథ్యంలో నిర్వహించారు. ఈ ఉత్సవాలకు గంగమ్మ తల్లి ఊరేగింపుకు స్థానిక నాయకులు పార్టీలతో సంబంధం లేకుండాహాజరయ్యారు. ఆలయంలో ఉదయం నుంచి మహిళలు భారీ ఎత్తున పొంగళ్ళు పెట్టారు.మొక్కులు తీర్చుకున్నారు. తెలుగుదేశం పార్టీలో కీలకంగా ఉన్న కంఠారమేష్ అమ్మవారి ఉత్సవాలను పార్టీలతో సంబంధం లేకుండా ధార్మిక చింతనతో నిర్వహించారు.అమ్మవారిని కన్నులుమిరుమిట్లుగొల్పునట్లు అలంకరించారు.ఈ ఉత్సవాల్లో ఉమ్మడి చిత్తూరుజిల్లా గ్రంథాలయ చైర్మెన్ రెడ్డి వారి గురువారెడ్డి, జనసేనకు చెందిన దండి నరేంద్ర,శ్రీకాళహస్తీశ్వరాలయ ధర్మకర్తల మండలి సభ్యుడు దండి రాఘవయ్య, తెలుగుదేశం అనుబంధ ఆలయాల చైర్మెన్లు ఎంఎస్‌రెడ్డి, బూడిదవాకం రేణుకాదేవి, సునీత,అద్దంకి భాగ్యలక్ష్మీ, పసుపులేటి నవీన్, గోవింద్ యాదగిరి, వెంకటేశ్వరచౌదరి, దారా పాండు, శివారెడ్డి, ఆర్ముగం బహాదూరుపేటకు చెందిన యువకులు హాజరయ్యారు. ఊరేగింపు కన్నుల పండువగా సాగింది.

# తిరుపతి డివిజన్

## పర్యావరణ పరిరక్షణపై కార్యశాల ప్రారంభం




తిరుపతి విద్య, ఆగస్టు 17 ప్రభాతవార్త

శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయంలోని రూసా-2.0 ఆధ్వర్యంలో పర్యావరణ విభాగం నేతృత్వంలో సుస్థిర భవిష్యత్తు కోసం పర్యావరణ ఆడిటింగ్ అంశంపై రెండు రోజుల కార్యశాల సోమవారం సెనేట్ హాల్లో ప్రారంభమైంది. ఈ కార్యక్రమంలో సైన్స్ కళాశాలకు చెందిన సుమారు 250 మంది విద్యార్థులు పాల్గొన్నారు.కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన యస్వీయూ ఉపకులపతి ఆచార్య టాటా నరసింగరావు పర్యావరణ ఆడిటింగ్ ప్రాధాన్యతను వివరించారు. పరిశ్రమల నుంచి వెలువడే వ్యర్థాలు, రంగు నీరు, కలుషిత నీటి వల్ల పర్యావరణానికి కలిగే నష్టాలను వివరించారు. పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని, పర్యావరణ చట్టాలను ఉల్లంఘించకుండా నిబంధనలను పాటించాలని సూచించారు.తిరుపతి కాలుష్య నియంత్రణ మండలి అధికారి ఎం. రాజశేఖర్ తిరుపతి ప్రాంతంలోని పర్యావరణ పరిస్థితులు, కాలుష్య నియంత్రణకు తీసుకుంటున్న చర్యలను వివరించారు. కీలకోపన్యాసంలో ఎన్ఏఆర్ఎల్ శాస్త్రవేత్త వెంకటరత్నం ఎకాలజీపై, డాక్టర్ చిదంబరం జన్యుశాస్త్రంపై విద్యార్థులకు అవగాహన కల్పించారు.పర్యావరణ విభాగం అధ్యక్షులు ఆచార్య దామోదర్ నేతృత్వంలో జరిగిన ఈ కార్యశాలలో పర్యావరణ పరిరక్షణ, సుస్థిర అభివృద్ధి, కాలుష్య నియంత్రణ తదితర అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు.

## ప్రజాస్వామ్య ప్రక్రియను ప్రత్యక్షంగా చూసిన విద్యార్థులు



తిరుపతి విద్య, ఆగస్టు 17 ప్రభాతవార్త

ఆంధ్రప్రదేశ్ శాసనసభ సమావేశాలు ప్రారంభమైన సందర్భంగా జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 10వ తరగతి విద్యార్థులకు అసెంబ్లీ గ్యాలరీలో కూర్చొని సభా కార్యక్రమాలను ప్రత్యక్షంగా వీక్షి ంచే అరుదైన అవకాశం లభించింది. ముఖ్యమంత్రి చొరవతో కల్పించిన ఈ అవకాశంలో 44 మంది విద్యార్థులు, ఐదుగురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.అసెంబ్లీ అధికారులను పాఠశాల తరఫున ఈ మెయిల్ ద్వారా సంప్రదించడంతో విద్యార్థులకు మొదటి స్లాట్ కేటాయించారు. ఈ సందర్భంగా శాసనసభలో ప్రజాప్రతినిధులు ప్రజా సమస్యలను ప్రస్తావించడం, వివిధ అంశాలపై చర్చించడం, ప్రశ్నలు అడగడం, ప్రభుత్వం సమాధానాలు ఇవ్వడం వంటి ప్రజాస్వామ్య ప్రక్రియలను విద్యార్థులు ప్రత్యక్షంగా గమనించారు. పాఠ్యపుస్తకాల్లో చదివిన ప్రజాస్వామ్య వ్యవస్థ, శాసనసభ పనితీరు, ప్రజాప్రతినిధుల బాధ్యతలను ప్రత్యక్ష అనుభవం ద్వారా మరింత స్పష్టంగా తెలుసుకున్నారు.అనంతరం విద్యార్థులు ఆంధ్రప్రదేశ్ సచివాలయాన్ని సందర్శించి రాష్ట్ర పరిపాలనా వ్యవస్థ, ప్రభుత్వ కార్యాలయాల పనితీరు, వివిధ పరిపాలనా అంశాలపై అవగాహన పొందారు. అలాగే మంగళగిరి నియోజకవర్గంలోని ఎల్ఈఏపీ పాఠశాలను సందర్శించి అక్కడి ఆధునిక విద్యా విధానం, సాంకేతికత ఆధారిత బోధన, విద్యార్థులకు అందిస్తున్న విద్యా సౌకర్యాలను పరిశీలించారు.ఈ పర్యటన విద్యార్థులకు పుస్తక జ్ఞానాన్ని ప్రత్యక్ష అనుభవంతో అనుసంధానం చేసే విలువైన అవకాశంగా నిలిచిందని పాఠశాల ప్రధానోపాధ్యాయులు తెలిపారు. విద్యార్థుల్లో ప్రజాస్వామ్య విలువలు, క్రమశిక్షణ, నాయకత్వ లక్షణాలు, బాధ్యతాయుత పౌరసత్వం, ప్రజాసేవ పట్ల గౌరవాన్ని పెంపొందించేందుకు ఈ పర్యటన ఎంతో దోహదపడిందన్నారు.విద్యార్థులకు ఇలాంటి అరుదైన అవకాశాన్ని కల్పించిన ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్, శాసనసభ స్పీకర్, డిప్యూటీ స్పీకర్, అసెంబ్లీ అధికారులు, సంబంధిత అధికారులకు పాఠశాల తరఫున ప్రధానోపాధ్యాయులు కృతజ్ఞతలు తెలిపారు.

## అంతర్జాతీయ లా మూట్ కోర్ట్ పోటీ బ్రోచర్ ఆవిష్కరణ

తిరుపతి విద్య, ఆగస్టు 17 ప్రభాతవార్త



డా.అంబేద్కర్ గ్లోబల్ లా ఇన్‌స్టిట్యూట్ ఆధ్వర్యంలో నిర్వహించనున్న ఫియట్ జస్టిటియా-2026 తొలి అంతర్జాతీయ లా మూట్ కోర్ట్ పోటీ అధికారిక బ్రోచర్‌ను సోమవారం కళాశాల ఆడిటోరియంలో ఆవిష్కరించారు. అక్టోబర్ 30 నుంచి నవంబర్ 1 వరకు మూడు రోజులపాటు తిరుపతిలోని డా.అంబేద్కర్ గ్లోబల్ లా ఇన్‌స్టిట్యూట్‌లో ఈ పోటీ జరగనుంది.కార్యక్రమానికి ఇండియా ఇంటర్నేషనల్ యూనివర్సిటీ ఆఫ్ లీగల్ ఎడ్యుకేషన్ అండ్ రీసెర్చ్ , గోవా ఉపకులపతి ప్రొఫెసర్ డా. ఆర్. వెంకటరావు ముఖ్య అతిథిగా, డా. అంబేద్కర్ గ్లోబల్ లా ఇన్‌స్టిట్యూట్ ఫౌండర్, డైరెక్టర్ డా. ఆర్. తిప్పా రెడ్డి అధ్యక్షతన హాజరయ్యారు. బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా సభ్యులు, బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా ట్రస్ట్-పి ఈ ఏ ఆర్ ఎల్ ఎగ్జిక్యూటివ్ వైస్ చైర్మన్ అడ్వొకేట్ అలూరు రామిరెడ్డి గౌరవ అతిథిగా పాల్గొన్నారు.అతిథుల రాకతో ప్రారంభమైన కార్యక్రమంలో తొలుత జ్యోతి ప్రజ్వలన చేశారు. అనంతరం డా. ఆర్. తిప్పా రెడ్డి మాట్లాడుతూ న్యాయ విద్యార్థుల్లో న్యాయ పరిజ్ఞానంతో పాటు పరిశోధన, విశ్లేషణాత్మక ఆలోచన, వాదనా నైపుణ్యాలను పెంపొందించేందుకు మూట్ కోర్ట్ పోటీలు ఎంతో ఉపయోగపడతాయని తెలిపారు. విద్యార్థులు ఇటువంటి అవకాశాలను సద్వినియోగం చేసుకుని భవిష్యత్ న్యాయ వృత్తికి అవసరమైన సామర్థ్యాలను పెంచుకోవాలని సూచించారు.అనంతరం ప్రిన్సిపాల్, చీఫ్ మూట్ కోర్ట్ ఆర్గనైజర్ డా. బిజయ కుమార్ బెహెరా మాట్లాడుతూ మూట్ కోర్ట్ పోటీలు విద్యార్థుల్లో న్యాయ పరిశోధన, విశ్లేషణాత్మక ఆలోచన, వాదనా నైపుణ్యం, ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించడంలో కీలక పాత్ర పోషిస్తాయని పేర్కొన్నారు.గౌరవ అతిథి అడ్వొకేట్ అలూరు రామిరెడ్డి మాట్లాడుతూ న్యాయ విద్యలో ఆచరణాత్మక శిక్షణకు ఎంతో ప్రాధాన్యత ఉందన్నారు. మూట్ కోర్ట్ పోటీల్లో చురుకుగా పాల్గొనడం ద్వారా విద్యార్థులు తమ వాదనా నైపుణ్యాలను మెరుగుపరుచుకోవడంతో పాటు న్యాయ వృత్తికి అవసరమైన సామర్థ్యాలను పెంపొందించుకోవచ్చని సూచించారు.ముఖ్య అతిథి ప్రొఫెసర్ డా. ఆర్. వెంకటరావు మాట్లాడుతూ అంతర్జాతీయ స్థాయిలో మూట్ కోర్ట్ పోటీ నిర్వహించేందుకు డా. అంబేద్కర్ గ్లోబల్ లా ఇన్‌స్టిట్యూట్ తీసుకున్న చొరవను అభినందించారు. దేశంలోని వివిధ విశ్వవిద్యాలయాలు, న్యాయ కళాశాలలకు చెందిన విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొని ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు.అనంతరం ముఖ్య అతిథి ప్రొఫెసర్ డా. ఆర్. వెంకటరావు, డా. ఆర్. తిప్పా రెడ్డి, అడ్వొకేట్ అలూరు రామిరెడ్డి తదితరులు కలిసి ఫియట్ జస్టిటియా-2026 అధికారిక బ్రోచర్‌ను ఆవిష్కరించారు. ఈ పోటీలో మొత్తం రూ.1.55 లక్షల నగదు బహుమతులతో పాటు వివిధ విభాగాల్లో ప్రతిభ కనబరిచిన వారికి పురస్కారాలు అందించనున్నారు.దేశంలోని వివిధ విశ్వవిద్యాలయాలు, న్యాయ కళాశాలల నుంచి న్యాయ విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొని ఈ పోటీని విజయవంతం చేయాలని నిర్వాహకులు కోరారు. కార్యక్రమంలో కన్వీనర్ జూలిమోల్ పి.ఆర్., అడ్వైజర్ ఎ. విష్ణు వందన, అధ్యాపకులు, బోధనేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు. అనంతరం అతిథులను ఘనంగా సన్మానించారు.

## దేవస్థానం తరపున సోమనాథ యాత్ర

శ్రీకాళహస్తి, ఆగస్టు 17 ప్రభాతవార్త

రాష్ట్రదేవాదాయశాఖ ఆదేశాలతో శ్రీకాళహస్తీశ్వరాలయ అధికారులు ధార్మిక కార్యక్రమాల్లో ఓ అడుగు ముందుకేసారు.ఈమేరకు సోమవారం ఆలయ ఇఓ బికె వెంకటేశులు ఓ ప్రకటన జారి చేస్తూ' సోమనాథ్ స్వాబిమాన్ పర్వ్-అఖండ విశ్వాసం' అనే కార్యక్రమాల్లో భాగంగా సోమనాథ దేవాలయాన్ని సందర్శించేందుకు వీలుగా ఏర్పాట్లు చేస్తున్నట్లు వివరించారు.ఆసక్తి గల భక్తులు,స్వచ్ఛంద సేవకులును పంపబడుతుందని వివరించారు.ఆసక్తి ఉన్న వారు తమ ఫోటో,ఆధార్‌కార్డు, వ్యక్తిగత వివరాలతో పాటు అభ్యర్థనను దేవస్థానం కార్యాలయంలో అందించాలని ఇఓ సూచించారు. వివరాలను పరిశీలించిన అనంతరం దేవస్థానం తరఫున ఎంపిక ప్రక్రియను చేపట్టి ఎంపికైన వారిని 'సోమనాథ ఆలయ సందర్శనకు పంపించే ఏర్పాట్లు చేస్తామని తెలిపారు.ఈ సదవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

## ప్రభుత్వాస్పత్రిలో వైద్యుల కొరత తీర్చాలి

పుత్తూరు, ఆగస్టు 17 ప్రభాతవార్త :




పుత్తూరు ప్రభుత్వాస్పత్రిలో వైద్యుల కొరత తీర్చాలని కోరుతూ దళిత, గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి వై.నందయ్య సోమవారం కలెక్టరేట్‌లోని పిజిఆర్ఎస్‌లో డిఆర్‌ఓ జి.నరసింహులుకు వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైద్యుల కొరత వల్ల రోగులకు సేవలు సక్రమంగా అందడం లేదన్నారు. ముఖ్యంగా గైనకాలజిస్ట్ లేకపోవడం వల్ల మహిళలు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ఆస్పత్రిలో మౌలిక వసతులు ఏర్పాటు చేయాలన్నారు. దీనిపై చర్యలు తీసుకుంటామని డిఆర్‌ఓ హామీ ఇచ్చారని తెలిపారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో కె.గంగాధరం, వి.శ్రీనివాసులు, పి.కృష్ణ తదితరులున్నారు.

## మహిళ ఆత్మహత్య



కుప్పం, ఆగస్టు 17 ప్రభాతవార్త

మండలంలోని కనమపచ్చార్లపల్లి గ్రామంకు చెందిన నందెమ్మ అనే మహిళ విషం తాగి ఆత్మహత్య చేసుకున్నట్లు కుప్పం అర్బన్ ఎస్సై బాబు తెలిపారు. ఎస్సై తెలిపిన మేరకు వివరాలిలా.. గ్రామానికి చెందిన చంద్రన్, నందెమ్మ (50) భార్య భర్తలు అని తెలిపారు. వీరికి ఐదు మంది సంతానం అన్నారు. కుటుంబ కలహాల నేపథ్యంలో నందెమ్మ శనివారం తమ ఇంటినుంచి అదృశ్యమైందన్నారు. కుటుంబీకులు గాలింపు చర్యలు చేపట్టారన్నారు. అయితే సోమవారం ఉదయం స్థానికంగా ఉన్న ఓ పూలతోట వద్ద నందెమ్మ మృతి చెంది ఉండడాన్ని గుర్తించి తమకు సమాచారం అందించారన్నారు. సంఘటనా స్థలికి చేరుకుని మృతదేహాన్ని పంచనామాకు తరలించి కుటుంబీకుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

## ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోండి

### ఇంటింటి ప్రచారంలో ముక్కా సాయి వికాస్ రెడ్డి

రైల్వే కోడూరు రూరల్, ఆగస్టు 17 ప్రభాతవార్త



మండలంలోని వెంకట రెడ్డిపల్లిలో సోమవారం ఇంటింటి ప్రచారంలో ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని టిడిపి ఇన్చార్జ్ ముక్కా రూప నంద రెడ్డి తనయుడు సాయి వికాస్‌రెడ్డి అన్నారు. ఈ సందర్భంగా గ్రామస్తులతో వారు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి సంక్షేమ పథకాలకు శ్రీకారం చుట్టారని ప్రభుత్వ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని వారు పిలుపునిచ్చారు. ఇప్పటికే గ్రామీణ ప్రాంతాలలో ప్రజలు కూటమి ప్రభుత్వంపై ఎంతో ఆదరణ కురిపిస్తున్నారని వారు అన్నారు. మండలంలో ఏ మారుమూల గ్రామానికి వెళ్లిన ప్రజలు ఆదరాభిమానాలతో గ్రామంలోకి ఆహ్వానిస్తున్నారని వారు అన్నారు. అనంతరం టిడిపి ఏర్పాటు చేసిన కరపత్రాలను గ్రామమంతా పంచిపెట్టారు. ఈ కార్యక్రమంలో మద్దిన గిరి, శేఖర్ రాజు, నాగేశ్వర్ రెడ్డి, ఎన్ఎస్ఆర్, అరవింద్, మధుసూదన్ రాజు, ఆకేపాటి సుకుమార్ రెడ్డి, చంద్రమోహన్‌తో పాటు కూటమికి చెందిన పార్టీ కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

## ముస్లిం సోదరులకు అండగా డాక్టర్ అంకయ్య

ఓజిలి, ఆగస్టు 17 ప్రభాతవార్త



ఓజిలి మండలం కురుగొండ గ్రామంలో పీఏసీఎస్ అధ్యక్షుడు డాక్టర్ అంకయ్య ముస్లిం సోదరులకు అండగా నిలిచారు. గ్రామంలోని ముస్లిం సోదరుల స్మశాన వాటికలో అవసరమైన భవన నిర్మాణానికి తన సొంత నిధుల నుంచి సుమారు రూ.1.50 లక్షలు కేటాయించి సోమవారం ఆ భవనానికి బండ ప్రారంభించడం లాంటి కార్యక్రమాలు చేశారు. ముస్లిం సోదరులకు స్మశాన వాటికలో వసతులు మెరుగుపరచాలనే ఉద్దేశంతో డాక్టర్ అంకయ్య ముందుకు వచ్చి ఈ సేవా కార్యక్రమాన్ని చేపట్టారు. ప్రజా అవసరాలను గుర్తించి, మత సామరస్యాన్ని చాటే విధంగా తన వంతు సహాయాన్ని అందించడం పట్ల ముస్లిం సోదరులు. మరియు గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ సందర్భంగా ముస్లిం సోదరులు డాక్టర్ అంకయ్యకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా డాక్టర్ అంకయ్య మాట్లాడుతూ సమాజంలో అన్ని వర్గాల ప్రజలు సోదరభావంతో కలిసి మెలిసి ఉండాలని, అవసరమైన సందర్భాల్లో ఒకరికొకరు అండగా నిలవాలని వారు పేర్కొన్నారు. భవన నిర్మాణం పూర్తి అయ్యేంతవరకు అన్ని విధాల ఆదుకుంటానని ముస్లిం సోదరులకు తెలిపారు. అనంతరం ముస్లిం సోదరులు మాట్లాడుతూ ప్రజా సేవే లక్ష్యంగా డాక్టర్ అంకయ్య చేస్తున్న కార్యక్రమాలు అభినందనీయమని గ్రామస్తులు కొనియాడారు. సొంత నిధులతో భవనం ఏర్పాటు చేయడం ద్వారా ముస్లిం సోదరుల పట్ల తనకున్న మానవతా దృక్పథాన్ని చాటుకున్నారని వారు తెలిపారు. కురుగొండ గ్రామంలో మత సామరస్యం, సోదరభావానికి ప్రతీకగా నిలిచేలా ఈ సేవా కార్యక్రమం కొనసాగడం పట్ల స్థానికులు సంతోషం వ్యక్తం చేశారు.

### మంగంపేట రాజకీయ సీనియర్ దిగ్గజం

## కౌలూరి నారాయణరెడ్డి కన్నుమూత...

### నివాళులర్పించిన పలువురు నాయకులు...



ఓబులవారిపల్లి, ఆగస్టు 17 ప్రభాతవార్త

రైల్వే కోడూరు నియోజకవర్గంలోని ఓబులవారిపల్లి మండలం మంగంపేట గ్రామ రాజకీయ సీనియర్ దిగ్గజం ప్రముఖ పారిశ్రామికవేత్త. కౌలూరి నారాయణరెడ్డి అనారోగ్యంతో ఆదివారం రాత్రి మృతి చెందినట్లు బంధువులు తెలిపారు. ఆయన అందరివాడిగా గ్రామ పెద్దమనిషిగా రాజకీయ నాయకుడిగా రాజారెడ్డి వైయస్ రాజశేఖర్‌రెడ్డి హయాం నుంచి అలాగే మాజీ ఎంపీ గునుపాటి రామయ్య మాజీ సర్పంచ్ గునిపాటి కేశవులు, అలాగే గల్లా శ్రీనువాసులు లాంటి సమకాలీలతో స్నేహపూర్వకంగా అందరివాడిగా పేరు తెచ్చుకుని ఉన్నారని, ఆయన మృతి ఎంతో బాధించిందని పలువురు నాయకులు రాష్ట్ర వైసీపీ సీనియర్ నాయకులు మాజీ ఎమ్మెల్యే కొరముట్ల శ్రీనివాసులు అభిప్రాయం వ్యక్తం చేశారు. అంతేకాకుండా పార్టీలకు అతీతంగా ఆయన పార్థివదేహానికి రాష్ట్ర ఖాదీ పరిశ్రమల శాఖ చైర్మన్ కేకే చౌదరి రాష్ట్ర టిడిపి నాయకులు ప్రముఖ పారిశ్రామిక వేత్తలు కస్తూరి విశ్వనాథ నాయుడు, మాచినేని విశ్వేశ్వరరావు నాయుడు పార్టీలకు అతీతంగా అన్ని పార్టీల నాయకులు కార్యకర్తలు ఆయన కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని తెలియజేసి నివాళులు అర్పించారు ఈ కార్యక్రమంలో పలువురు ప్రజలు పాల్గొన్నారు.

## అకడమిక్ ఇన్‌స్ట్రక్టర్ పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానం

పెనగలూరు, ఆగస్టు 17 ప్రభాతవార్త

పెనగలూరు మండలంలో అకడమిక్ ఇన్ స్ట్రక్టర్ పోస్టులు 41 ఖాళీలు ఉన్నట్లు ఎంఈవో గిరి వరదయ్య తెలిపారు. అర్హులు ఈ నెల 19 వ తేదీ లోపు దరఖాస్తు చేసుకోవాలన్నారు. పూర్తి వివరాలకు 9441633834కు, మండల విద్యాశాఖ కార్యాలయంలో సంప్రదించాలని ఆయన సూచించారు.

## అన్నా క్యాంటీన్లను పరిశుభ్రంగా ఉంచండి

### కమిషనర్ ఎం.జయకృష్ణ



తిరుపతి కార్పొరేషన్, ఆగస్టు17 ప్రభాతవార్త:

నగరంలోని అన్నా క్యాంటీన్లను, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని నగరపాలక సంస్థ కమిషనర్ ఎం.జయకృష్ణ సిబ్బందిని ఆదేశించారు. సోమవారం ఉదయం ఎమ్మార్ పల్లి వద్ద గల నగరంలోని అన్నా క్యాంటీన్ ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ప్రజలతో కలిసి అల్పాహారం స్వీకరించి, ఆహార నాణ్యతను పరిశీలించి ప్రజల నుండి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. సీతమ్మ నగర్ రోడ్డు, ఎమ్మార్ పల్లి, న్యూ మారుతీ నగర్ తదితర ప్రాంతాల్లో పారిశుధ్య పనులను, మంచినీళ్ళ కుంటను పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ అన్నా కాంటీన్లతో పాటు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని తెలిపారు. ఆహ్లాధకరమైన, పరిశుభ్రమైన వాతావరణంలో ప్రజలకు ఆహార పదార్థాలు స్వీకరించేలా ఏర్పాటు చేయాలని తెలిపారు. స్వచ్ఛమైన, శుభ్రమైన త్రాగునీరు అందించాలని తెలిపారు. ఒక్కొక్కరు ఒక్క టోకెన్ మాత్రమే ఇవ్వాలని సూచించారు. ప్లేట్లు, పాత్రలు శుభ్రంగా ఉంచాలని తెలిపారు. ఆహార పదార్థాలు వృధా చేయకుండా, తగినంత వడ్డించాలని తెలిపారు. అన్నా కాంటీన్లలో ఎటువంటి ఇబ్బందులు ఉన్నా మా దృష్టికి తెస్తే వెంటనే పరిష్కరిస్తామని తెలిపారు. పారిశుధ్య పనులు మెరుగ్గా చేపట్టాలని, కాలువల్లో చెత్త లేకుండా తొలగించాలని సిబ్బందిని ఆదేశించారు. అనంతరం మంచినీళ్ళ కుంటను అధికారులతో కలిసి పరిశీలించారు. కమిషనర్ వెంట హెల్త్ ఆఫీసర్ డాక్టర్ యువ అన్వేష్, శానిటరీ సూపర్ వైజర్ చెంచయ్య, తదితరులు ఉన్నారు.

## రిటైర్డ్ ఉద్యోగిపై దాడి

తొట్టంబేడు, ఆగస్టు 17 ప్రభాతవార్త

కల్లిపూడి తెలుగు గంగ కాలువ వద్ద పెంచుతున్న చెట్టును నరికేయడాన్ని ప్రశ్నించినందుకు రిటైర్డ్ ఉద్యోగిపై దాడి జరిగినట్లు ఫిర్యాదు అందిందని సోమవారం ఎస్ఐ బాలకృష్ణ తెలిపారు. ఆయన వివరాల మేరకు ఇలా ఉన్నాయి గ్రామానికి చెందిన రిటైర్డ్ ఉద్యోగి తెలుగు గంగ కాలువ వద్ద ఒక చెట్టును పెంచుతున్నారు. అదే గ్రామానికి చెందిన మరొక వ్యక్తి ఆ చెట్టును నరికివేశాడు. దీన్ని గమనించిన రిటైర్డ్ ఉద్యోగి అక్కడికి వెళ్లి "నేను ఎంతో ఇష్టంగా పెంచిన ఈ చెట్టును ఎందుకు నరికారు" అని ప్రశ్నించారు. అంతే ఆ వ్యక్తి ఆగ్రహంతో రిటైర్డ్ ఉద్యోగిపై దాడి చేశాడు. ఈ ఫిర్యాదు మేరకు తొట్టంబేడు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

## కనపర్తిలో పరస్పర దాడులు

తొట్టంబేడు, ఆగస్టు 17 ప్రభాతవార్త

కనపర్తి గ్రామంలో భూమి గొడవ కుటుంబంలో చిచ్చు రేపింది. అన్నదమ్ముల మధ్య మొదలైన గొడవ తోడికోడళ్ల వీధి కొట్లాటకు దారితీసింది. తొట్టంబేడు మండలం పెద్ద కనపర్తి గ్రామంలో ఓ భూమి విషయంలో అన్నదమ్ముల మధ్య గొడవ జరిగింది. మాట మాట పెరిగి ఇరు కుటుంబాల మధ్య వాగ్వాదం తీవ్రమైంది. ఈ క్రమంలో ఇరువైపుల తోడికోడళ్లు కూడా రంగంలోకి దిగారు. ఒకరినొకరు దూషించుకుంటూ వీధిలో పడి రచ్చలు చేశారు . స్థానికులు వచ్చి ఇరువురిని విడదీశారు.ఈ ఘటనపై ఇరు వర్గాలు తొట్టంబేడు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదులు చేయడంతో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్.ఐ బాలకృష్ణ తెలిపారు.

## గుర్తు తెలియని మృతదేహం లభ్యం

పుత్తూరురూరల్, ఆగస్టు 17 ప్రభాతవార్త:

పుత్తూరు పట్టణంలోని సాయంత్రం 6 గంటలకు నారాయణవనం రోడ్డులో వీరపురెడ్డి పాళెం చెరువులో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం నీటిలో మృతి చెంది తేలియాడుతూ కనిపించాడు. చుట్టుపక్కల ప్రజలు గమనించి మృతదేహాన్ని చెరువు నుంచి ఒడ్డుకు తీసుకువచ్చారు. మృతుని పూర్తి వివరాలు, గుర్తింపు కోసం చుట్టు పక్కల ప్రాంతాల్లో విచారించగా ఇప్పటి వరకు ఎవరూ గుర్తించలేదు. ఈ వ్యక్తికి 50 నుంచి 55 సంవత్సరాల వయసు ఉంటుందని, ఈ వ్యక్తిని ఎవరైనా గుర్తించినట్లయితే, వారి కుటుంబ సభ్యులు, బంధువులకు సంబంధించిన సమాచారం తెలిస్తే వెంటనే పుత్తూరు టౌన్ ఎస్ఐ 9440796728, పుత్తూరు సీఐ 9440796727 నంబర్లకు సమాచారం ఇవ్వాలని వారు కోరారు.

## వీజీ రాంజీ కూలీ మృతి

సత్యవేడు, ఆగస్టు 17 ప్రభాతవార్త:

సత్యవేడు మండలం శ్రీసిటీ పరిధిలోని వా నెల్లూరు గ్రామానికి చెందిన వి.కృష్ణయ్య(60) వీజీ రాంజీ పని చేస్తూ కూలి అక్కడే మృతి చెందిన సంఘటన చోటు చేసుకుంది. స్థానికుల వివరాల మేరకు... కృష్ణయ్య సోమవారం ఉదయం వా నెల్లూరులో వీజీ రాంజీ పనికి వెళ్లారు. వా నెల్లూరు అటవీ ప్రాంతంలోనీటి నిల్వ కుంటలు నిర్మించడం కొరకు గత కొద్ది దినాలుగా ఉపాధి పని నిర్దేశించబడింది. కృష్ణయ్యతో పాటు పలువురు వా నెల్లూరు వాసులు సోమవారం వీజీ రాంజీ పని కొరకు అటవీ ప్రాంతానికి వెళ్లారు.పని జరుగుతుండగా సుమారు 11 గంటలసమయంలో పని చేస్తూ కృష్ణయ్య ఉన్నట్లుండి కుప్పకూలిపోయారు. తోటి కూలీలు అడవి నుంచి కృష్ణయ్యను సత్యవేడు సామాజిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు. అక్కడ పరిశీలించిన వైద్యులు కృష్ణయ్య అప్పటికే మృతి చెందినట్లు తెలిపారు. స్థానికులు మాత్రం ఉపాధి పనుల వద్ద నీరు తాగునీరు కాని, ప్రథమ చికిత్సకు సంబంధించిన మందులు కానీ అందుబాటులో ఉండడం లేదని, నీడ కొరకు షామినా వంటివి ఏర్పాటు చేయడం లేదని వాపోతున్నారు.

## శ్రీకాంత్‌పై ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు : డీఎస్పీ

సత్యవేడు, ఆగస్టు 17 ప్రభాతవార్త:



సత్యవేడు మండల కేంద్రంలో ఇటీవల శ్రీకాంత్ అనే విలేకరిపై నమోదైన ఎస్సీ, ఎస్టీ, అట్రాసిటీ కేసును పుత్తూరు డీఎస్పీ రవికుమార్ ప్రాథమిక విచారణ చేస్తుండగా నిందితుడు ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన చోటు చేసుకుంది. పుత్తూరు డీఎస్పీ రవికుమార్ వివరాల ప్రకారం గత వారంలో సత్యవేడు మేజర్ పంచాయతీలో ఔట్‌సోర్సింగ్ సిబ్బంది తన సోదరుని బంధువు బర్త్ సర్టిఫికెట్ కొరకు 4 వేలు లంచం అడిగాడని పీజీఆర్ఎస్‌లో ఫిర్యాదు చేశారు. అంతటితో ఆగక సదరు ఫిర్యాదు పై ప్రెస్ నోటు విడుదల చేశారు. మరుసటి రోజు పంచాయతీ కార్యాలయానికి వెళ్లి ఔట్‌సోర్సింగ్ సిబ్బందిని బెదిరింపులకు గురి చేశాడంటూ కులం పేరుతో దూసించాడంటూ ఔట్‌సోర్సింగ్ సిబ్బంది సెల్ టవర్ ఎక్కి ఆత్మహత్యకు పాల్పడుతున్నట్లు ఆడియో విడుదల చేశారు. ఇదే పథ్యంలో ఔట్‌సోర్సింగ్ సిబ్బంది ఫిర్యాదు మేరకు నిందితుడు శ్రీకాంత్‌పై ఎస్సీ, ఎస్టీ, అట్రాసిటీ కేసు, చీటింగ్ కేసు, వంటి కేసులు నమోదు చేశారు. దీనిపై సోమవారం పుత్తూరు డీఎస్పీ రవికుమార్ ప్రాథమిక విచారణ చేపట్టడం కొరకై సత్యవేడు పంచాయతీ కార్యాలయం చేరుకున్నారు. ఈ నేపథ్యంలో విలేకరి శ్రీకాంత్ పోలీసులు తనపై తప్పుడు కేసులు బనాయించారంటూ సత్యవేడు ఇండోర్ స్టేడియం నుంచి మూడు సెల్ఫీ వీడియోలు విడుదల చేశారు. దీనిపై స్పందించిన డీఎస్పీ నిరాధారమైనవని కేవలం ఫిర్యాదు దారుని ఫిర్యాదు మేరకే కేసు నమోదు చేశామన్నారు. ప్రస్తుతం ప్రాథమిక విచారణ జరుగుతుందన్నారు. ప్రస్తుతం నిద్ర మాత్రలు మింగి ఆత్మహత్యకు పాల్పడిన శ్రీకాంత్‌ని డీఎస్పీ ఆదేశాల మేరకు సీఐ మురళీనాయుడు సూచనలతో ఎస్ఐ సాయినాథ్‌చౌదరి సత్యవేడు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అక్కడ శ్రీకాంత్ ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉందన్నారు.

### సంక్షేమ పథకాల అమలులో

## రాజకీయాలకు తావివ్వొద్దు

### అర్హులైన నేతన్నలకు న్యాయం చేయాలి : ఎంపీ గురుమూర్తి

వెంకటగిరి, ఆగస్టు 17, ప్రభాతవార్త

చేనేత కార్మికుల సంక్షేమం కోసం అమలు చేస్తున్న పథకంలో అర్హులైన లబ్ధిదారులకు అన్యాయం జరుగుతోందని ఎంపీ మద్దిల గురుమూర్తి ఆవేదన వ్యక్తం చేశారు. వెంకటగిరి పట్టణానికి చెందిన చేనేత కార్మికులతో జిల్లా కలెక్టర్ డాక్టర్ వెంకటేశ్వర్ కలిసి వారి సమస్యలను వివరించడంతో పాటు, అర్హులైన నేత కార్మికుల వివరాలను అందజేశారు. మగ్గాలు ఉన్న నిజమైన చేనేత కార్మికులను పక్కనపెట్టి, మరణించిన వ్యక్తుల పేర్లతో, విదేశాల్లో ముఖ్యంగా దుబాయ్‌లో ఉన్నవారి పేర్లతో, అసలు మగ్గాలు లేని వారికి కూడా పథకం కింద లబ్ధి చేకూర్చడం అత్యంత దారుణమని ఎంపీ గురుమూర్తి అన్నారు. అర్హులైన దాదాపు 150 మంది మగ్గం కార్మికుల వివరాలను కలెక్టర్‌కు సమర్పించినట్లు తెలిపారు. ఈ జాబితాపై క్షేత్రస్థాయిలో సమగ్రంగా పరిశీలన జరిపి, నిజమైన అర్హులను గుర్తించి వారికి పథకం ద్వారా న్యాయం చేయాలని కలెక్టర్‌ను కోరినట్లు ఎంపీ తెలిపారు. సంక్షేమ పథకాల లబ్ధిదారుల ఎంపికలో రాజకీయాలకు తావివ్వడం సరికాదని, ఎవరైతే పథకానికి అర్హులో వారందరికీ కచ్చితంగా ప్రభుత్వ సంక్షేమ పథకం అందాలని స్పష్టం చేశారు. గత వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వ హయాంలో అర్హతే ప్రామాణికంగా తీసుకుని సంక్షేమ పథకాలను నిష్పక్షపాతంగా అమలు చేశామని ఎంపీ గుర్తు చేశారు. అదే విధంగా ప్రస్తుతం కూడా నిజమైన అర్హులైన చేనేత కార్మికులకు ఎలాంటి వివక్ష లేకుండా పథకం అందించాలని డిమాండ్ చేశారు. సంక్షేమ పథకాల అమలులో రాజకీయాలకు తావివ్వరాదని ఆయన అన్నారు. చేనేత కార్మికుల సంక్షేమం విషయంలో రాజకీయాలకు అతీతంగా వ్యవహరించి, అర్హులైన ప్రతి ఒక్కరికీ న్యాయం జరిగేలా అధికారులు చర్యలు తీసుకోవాలని ఎంపీ కోరారు.

# తిరుపతి డివిజన్

## కార్మికుల బలం బిఎంఎస్

### కష్టానికి తగిన జీతాలివ్వాలంటూ ధర్నా

తిరుపతి కలెక్టరేట్, ఆగస్టు 17 ప్రభాతవార్త :



కార్మికుల బలం భారతీయ మజ్దూర్ సంఘ (బి ఎం ఎస్) అని, కార్మికుల కష్టానికి తగిన జీతాలు ఇచ్చే విధంగా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు తగిన నిర్ణయాలు తీసుకోవాలని భారతీయ మజ్దూర్ యూనియన్ జిల్లా అధ్యక్షులు ఆకుల సుబ్రహ్మణ్యం సతీష్ కుమార్ స్పష్టం చేశారు. భారతదేశ వ్యాప్తంగా ఆగస్టు 17న ఆయా జిల్లాల కలెక్టరేట్ల వద్ద కార్మికుల కష్టానికి తగిన ఫలితాన్ని ఇవ్వాలని కోరుతూ పెద్ద ఎత్తున నిరసన కార్యక్రమాలు చేపట్టారు. ఆకుల సుబ్రహ్మణ్యం సతీష్ కుమార్ ఆధ్వర్యంలో తిరుపతి జిల్లా కలెక్టరేట్ కార్యాలయం ఎదుట సోమవారం అన్ని సంఘాల నాయకులు, కార్మికులతో కలిపి పెద్ద ఎత్తున ధర్నా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి ఆకుల సుబ్రహ్మణ్యం సతీష్ కుమార్ మాట్లాడుతూ కార్మికుల కష్టానికి తగిన జీతాలు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఇవ్వడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రతి కార్మికుడికి ప్రభుత్వ ఉద్యోగునికి తో సమానంగా ఈఎస్ఐ, ఈపీఎఫ్, బోనస్ లు ఇవ్వాలని, ప్రత్యేక కార్మిక చట్టాలు తీసుకుని రావాలని విజ్ఞప్తి చేశారు. అలాగే బ్యాంకులో పనిచేసే ఉద్యోగులకు ఐదు రోజుల పని విధానాన్ని అమలు చేయాలన్నారు. ప్రతి కార్మికులకి జాతీయ కనీస వేతనాన్ని నెలకు రూ.30 వేలు గా నిర్ణయించాలని డిమాండ్ చేశారు. టిటిడి, దేవాదాయ శాఖ, ఔట్సోర్సింగ్ శాఖలో పనిచేసే కార్మికులకు టిటిడి ఉద్యోగుల తో సమానంగా సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని అన్నారు. ఈ కార్యక్రమంలో బిఎంఎస్ వైస్ ప్రెసిడెంట్ శివ శంకరయ్య, జాయింట్ సెక్రెటరీ ముని కుమార్, కో కన్వీనర్ సుకుమార్, ట్రెజరర్ రవి, అన్ని కార్మిక సంఘాల నేతలు, సభ్యులు, కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



**జిల్లా కలెక్టర్ డా.ఎస్.వెంకటేశ్వర్ ని మర్యాద పూర్వకం గా కలిసిన శ్రీ వెంకటేశ్వర భక్తి చానల్ నియమిత చైర్మన్ శ్రీధర్ వర్మ**

తిరుపతి కలెక్టరేట్, ప్రభాతవార్త

## 24న ఛలో కలెక్టరేట్

శ్రీకాళహస్తి ఆగస్ట్ 17 ప్రభాతవార్త




సామాజిక శంఖారావంలో వెలుగు చూసిన దళిత సమ స్యల పరిష్కారానికై ఈనెల 24న కలెక్టరేట్ ముట్టడి కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం జిల్లా గౌరవాధ్యక్షులు అంగేరి పుల్లయ్య వెల్లడించారు. స్థానిక పుచ్చలపల్లి సుందరయ్య భవనంలో కెవిపిఎస్, వ్యవసాయ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో సోమవారం సామాజిక శంఖారావంపై సమీక్షా సమావేశం నిర్వహించారు. జూలై 15వ తేదీ నుంచి నియోజకవర్గంలో సామాజిక శంఖారావం కార్యక్రమాన్ని చేపట్టినట్లు పేర్కొన్నారు. సమస్యలను సచివాలయం స్థాయి నుంచి ఆర్డీవో వరకు తీసుకెళ్లిన పరిష్కారం కాలేదన్నారు. స్వాతంత్రం సిద్ధించి 80 ఏళ్ళు దాటినా దళితవాడల్లో ఇంకా సామాజిక అంతరాలు, అస్పృశ్యతలు వివిధ రూపాల్లో దర్శనమిస్తున్నాయని వాపోయారు. ముఖ్యంగా దళితులకు శ్మశానాలు లేక కాలువ గట్లపై అంత్యక్రియలు నిర్వహించుకోవాల్సిన దుస్థితి ఏర్పడిందని వాపోయారు. దళితవాడల్లో అంటరానితనం, కుల వివక్ష, మౌలిక వసతుల లేమిపై కమిటీలు వేశామనీ, ఛలో కలెక్టరేట్ కు దళితులు పెద్ద ఎత్తున హాజరై ఆందోళనలో పాలుపంచుకోవాలని పిలుపునిచ్చారు. వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు గంధం మణి, పెనగడం గురవయ్య, కేవీపీఎస్ నాయకులు వెంకటేష్, రాధమ్మ తదితరులు పాల్గొన్నారు.

## పూడి, ఇలాగనూరు ఎస్టీకాలనీల్లో

## టీడీపీ డోర్ టు డోర్ ప్రచారం

తొట్టంబేడు, ఆగస్టు 17 ప్రభాతవార్త



ప్రజలకు మరింత చేరువగా వెళ్లేందుకు తెలుగుదేశం పార్టీ డోర్ టు డోర్ కార్యక్రమం మండలంలో ఉత్సాహంగా సాగుతోంది. సోమవారం పూడి, ఇలాగనూరు ఎస్టీ కాలనీల్లో టీడీపీ నాయకులు, కార్యకర్తలు ఇంటింటికీ వెళ్లి ప్రజలను కలుసుకున్నారు. మండల పార్టీ అధ్యక్షులు రావిళ్ల మునిరాజ నాయుడు సారధ్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో నాయకులు ప్రజలతో నేరుగా మమేకమయ్యారు. ప్రతి ఇంటి వద్దకు వెళ్లి వారి కష్టసుఖాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మునిరాజ నాయుడు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరించారు. ప్రభుత్వం అందిస్తున్న లబ్ధిని ప్రతి అర్హుడికి చేరేలా చూడాల్సిన బాధ్యత కార్యకర్తలపై ఉందని అన్నారు. గ్రామస్థాయిలో పార్టీని మరింత బలోపేతం చేసేందుకు ప్రతి ఒక్కరూ చురుకుగా పనిచేయాలని సూచించారు. ప్రజలతో కలిసి ముందుకు సాగుతూ వారి సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తామని ఆయన భరోసా ఇచ్చారు.ఈకార్యక్రమంలో సీనియర్ నాయకులు, తెలుగుదేశం మాజీ రాష్ట్ర కార్యదర్శి గాలి చలపతి నాయుడు, గాలి మురళి నాయుడు, వాసు నాయుడు, డి. రామానాయుడు, శంకర్ నాయుడు, జెడ్పీటీసీ మునిరత్నం, వెంకటాచలం మాజీ జెడ్పీటీసీ, రమణారెడ్డి, పి. రాజేంద్ర, క్లస్టర్ ఇన్చార్జ్ కొన్నలి రమేష్ తో పాటు గ్రామ ఇన్‌చార్జ్‌లు జె. శేషం నాయుడు, సి. వసంత్ నాయుడు, జె. శ్యామ్ సుందర్, ఎం. మునిశేఖర్, ఎ. సురేష్ కుమార్, వి. పెంచిలయ్య, వి. చంద్రారెడ్డి, టి. వెంకట రమణ నాయుడు, సి. అనంత్, సి. హేమాద్రి నాయుడు, టి. రామచంద్ర నాయుడు, ఇ. పెంచిలయ్య, పి. మునిరత్నం.. మరియు ..మాజీ సర్పంచ్ ఎం. మాధవి, మాజీ సర్పంచ్ గణేష్, బూత్ ఇన్‌చార్జ్‌లు డి. ప్రభాకర్, నెలబల్లి సునీల్ కుమార్, సుశేఖర్ నాయుడు, చెంచయ్య, సుబ్రహ్మణ్యం, రామ్ మూర్తి, నాగరాజు, మధు నాయుడు, గీత, ఇ. రామయ్య, పి. రాజగోపాల్ పాల్గొని ప్రచారాన్ని విజయవంతం చేశారు.

## టిటిడి ట్రాన్స్‌పోర్టు వర్కర్స్‌యూనియన్ ఎన్నిక



తిరుమల,ఆగస్టు 17ప్రభాతవార్తప్రతినిధి:

టిటిడి ట్రాన్స్ పోర్ట్‌శాశ్వత సిబ్బంది యూనియన్ ఎన్నికలు సోమవారం జరిగాయి. యూనియన్ అధ్యక్షుడుగా ఎం.రవీంద్రారెడ్డి, కోశాధికారిగా వివి వరప్రసాద్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ప్రధాన కార్యదర్శి పదవికి జరిగిన ఎన్నికల్లో ఎన్.లక్ష్మణరావు 54ఓట్లతో గెలుపొందారు. నూతన కమిటీకి ట్రాన్స్ పోర్టు వర్కర్స్ యూనియన్ అభినందనలు తెలిపారు.

## కేంద్ర హోం శాఖ సహాయ మంత్రికి ఘనస్వాగతం



**కేంద్ర మంత్రి బండి సంజయ్ తిరుపతిలో టీటీడీ బోర్డు మెంబరు భాను ప్రకాష్ రెడ్డి నివాసానికి విచ్చేసారు. ఆయనకు ఘన స్వాగతం పలికిన బిజెపి నాయకులు భాను ప్రకాష్ రెడ్డి, బీజేవైఎం రాష్ట్ర ఉపాధ్యక్షులు పృథ్వి రెడ్డి,బిజెపి సీనియర్ నాయకులు గుండాల గోపీనాథ్, చంద్రారెడ్డి, పెరియస్వామి రామ్ కుమార్ , భాస్కర్, మల్ల కుప్పం శేఖర్, తొండమనాటి సుబ్రహ్మణ్యం రెడ్డి, అశోక్, రవి ప్రసాద్, అరుణ్ రాయల్ తదితరులు**